


29, 30 తేదీల్లో ప్రభుత్వ ఉద్యోగులకు ఆటల పోటీలు

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: ఏపీ, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో 29, 30 తేదీల్లో ప్రభుత్వ ఉద్యోగులకు పలు క్రీడాంశాల్లో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సురేష్ శుక్రవారం తెలిపారు. అథ్లెటిక్స్, షటిల్, చెస్, హాకీ, లాన్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్, క్రికెట్, కబడ్డీ, రెజ్లింగ్, క్యారమ్స్, బాస్కెట్ బాల్, ఫుట్‌బాల్, ఖో-ఖో, వెయింట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, మ్యూజిక్, వాలీబాల్, యోగా, బెస్ట్ ఫిజిక్ క్రీడా విభాగాల్లో ఎంపికలు ఉంటాయన్నారు. ఆసక్తి గల ప్రభుత్వ ఉద్యోగులు తమ కార్యాలయ గుర్తింపు కార్డులతో, ధ్రువపత్రాలతో నరసరావుపేటలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో గల జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో 29న హాజరుకావాలన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన వారికి నవంబరు 6 నుంచి 9 వరకు విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్రస్థాయి ఎంపికలు ఉంటాయని తెలిపారు. వివరాలకు 87126 22574 నంబరులో సంప్రదించాలన్నారు.

పారిశుద్ధ్యం పట్టదు...
మురుగు కదలదు!

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, దాచేపల్లి

గత ఆగస్టులో గురజాల నియోజకవర్గం పిడుగురాళ్ల పట్టణ శివారు కాలనీ లెనిన్‌నగర్, మారుతినగర్ కాలనీల్లో డయేరియా వ్యాప్తిచెంది ఏడుగురు చనిపోవడంతో పాటు పదుల సంఖ్యలో ఆస్పత్రిపాలయ్యారు. ఇది జరిగినపుడు కేవలం పిడుగురాళ్ల పట్టణంలోనే అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. మిగతా ప్రాంతాల సంగతి మరిచారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అదే నియోజకవర్గం దాచేపల్లిలో సమస్య ఉత్పన్నమైంది. జిల్లాలో గురజాల, మాచర్ల నియోజకవర్గాల్లో ఎక్కువగా అతిసార కేసులు నమోదవుతున్నాయి. వైద్యశాఖతో పాటు, మున్సిపల్‌శాఖ కూడా శాశ్వత చర్యలు తీసుకోవడానికి ప్రణాళికలు వేయాల్సిన అవసరం ఉంది.



అంజనాపురం కాలనీలో ఇళ్ల ముందు మురుగుకుంట

శివారు కాలనీలపై చిన్నచూపు

పిడుగురాళ్ల పట్టణంలో అతిసారం కేసులు నమోదైన రెండు కాలనీలు కూడా శివారువే. తాజాగా దాచేపల్లి పట్టణంలో అంజనాపురం కూడా శివారు కాలనీనే. మున్సిపాలిటీ సిబ్బంది శివారు కాలనీలను చిన్నచూపు చూస్తున్నారు. అందుకే సమస్యలు పేరుకుపోతున్నాయి. వారానికోసారి అయినా చెత్త, మురుగుకాల్వల్లో పూడిక తీయడం లేదు. తాగునీటి పైపులైన్లు మార్చడం లేదు. పిడుగురాళ్ల లెనిన్‌నగర్, మారుతినగర్ కాలనీలపై వైకాపా పాలనలో పూర్తిగా శీతకన్ను వేశారు. దీంతో అక్కడ సమస్య తలెత్తింది. ప్రస్తుతం అంజనాపురం కాలనీలో కూడా మొన్నటి ఎన్నికల ముందు హడావిడిగా రెండు మురుగుకాల్వలు నిర్మించి వదిలేశారు. అదీ ఓ వీధిలో సగం వరకే వేశారు. కాలనీలో అన్ని వీధులకు మురుగు కాల్వలే లేవు. ఎవరికి వారు ఇళ్లముందు మురుగుకుంటలు తవ్వి అందులోకి ఇళ్లలోని వాడుకనీరు పోయేలా ఏర్పాట్లు చేసుకున్నారు.

గురజాల, మాచర్ల ప్రాంతాల్లో డయేరియా కేసులు

దాచేపల్లి అంజనాపురం కాలనీలోనూ సమస్య

వైకాపా పాపాలు.. ప్రజలకు శాపాలు

వైకాపా పాలనలో పట్టణాలు, నగర పంచాయతీలను పట్టించుకోలేదు. ఒక్క అభివృద్ధి పని కూడా చేపట్టలేదు. కనీసం మురుగుకాల్వల్లో పూడిక తీయలేదు. దీంతో చాలా చోట్ల అవి ఆనవాళ్లు లేకుండా పోయాయి. మరి కొన్ని కాలనీల్లో సీసీరోడ్లు, మురుగుకాల్వలు కూడా నిర్మించలేదు. మరోవైపు తాగునీరు సరఫరా చేసే పైపులకు లీకేజీలు ఏర్పడినా బాగుచేయలేదు. ఈ క్రమంలో జిల్లాలో అక్కడక్కడ డయేరియా కేసులు నమోదవుతున్నాయి. వైకాపా పాపం ప్రజలకు శాపమైంది. వాంతులు, విరేచనాలతో ఆస్పత్రులపాలవుతున్నారు. మరోవైపు మున్సిపల్ అధికారులు కూడా పిడుగురాళ్ల ఘటన చూసి అయినా గుణపాఠం నేర్చుకోలేదు. అప్పుడు కేవలం పిడుగురాళ్లలో మాత్రమే మురుగుకాల్వలను పూడికలు తీయించి బాగు చేయించారు. గురజాల, దాచేపల్లిలను విస్మరించారు.

మాచర్ల, గురజాల్లోనే కేసులు ఎందుకు?

జిల్లాలో డయేరియా కేసులు మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లోనే ఎక్కువగా నమోదవుతున్నాయి. మాచర్ల నియోజకవర్గంలో దుర్గి, రెంటచింతల, కారంపూడి మండలాల్లో, గురజాల నియోజకవర్గంలో పిడుగురాళ్ల, దాచేపల్లి పట్టణ శివారు కాలనీల్లో పలువురు వాంతులు, విరేచనాల బారిన పడుతున్నారు. జిల్లాలో మిగతా ప్రాంతాలతో పోలిస్తే ఈ రెండు నియోజకవర్గాల్లో పారిశుద్ధ్యం కొరవడుతోంది. పట్టణాల్లోనే సరైన మురుగుకాల్వలు లేవు. చెత్త కుప్పలు దర్శనమిస్తుంటాయి. నరసరావుపేట, సత్తెనపల్లి, వినుకొండ, చిలకలూరిపేట పట్టణాలతో పోలిస్తే పిడుగురాళ్ల, దాచేపల్లి, మాచర్ల, కారంపూడి పట్టణాలు శుభ్రతలో వెనుకబడి ఉన్నాయి. మున్సిపల్, నగర పంచాయతీ అధికారులు పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టడం లేదు.



కాలనీలో మురుగుకాలువ లేక ఇలా..



వంతెన నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరణలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ, నేతలు



గుండ్లకమ్మ నదిపై వంతెన నిర్మించనున్న ప్రదేశం

గుండ్లకమ్మపై వంతెనతో తొలగనున్న కష్టాలు

రూ.21 కోట్లతో నిర్మాణ పనులకు శంకుస్థాపన

నూజండ్ల, వినుకొండ, న్యూస్‌టుడే: వినుకొండ నియోజకవర్గంలోని పువ్వాడ- గోకనకొండ మధ్య గుండ్లకమ్మ నదిపై నిర్మించనున్న వంతెన నాలుగు జిల్లాల ప్రజలను అనుసంధానం చేయనుంది. పల్నాడు జిల్లా నూజండ్ల మండలంతో పాటు ప్రకాశం, బాపట్ల, గుంటూరు జిల్లాల ప్రజల ప్రయాణానికి ఉపయోగకరంగా మారుతుంది. దూరం తగ్గడంతో త్వరగా గమ్యం చేరేందుకు వీలుంటుందని ప్రజలు భావిస్తున్నారు. వినుకొండ, నాగులవరం మీదుగా అద్దంకి వెళ్లే రోడ్డు దీనికి అనుసంధానం అవుతుంది. దీంతో ఈ ప్రాంతప్రజలు వినుకొండ వచ్చి గుంటూరు వెళ్లాలన్నా అటు అద్దంకి మీదుగా ఒంగోలు, బాపట్ల వెళ్లాలన్నా సులభంగా ఉంటుంది. కొంచెం ముందుకెళ్తే నార్కెట్‌పల్లె- అద్దంకి రోడ్డుకు అనుసంధానం అవుతుంది. తద్వారా పిడుగురాళ్ల, హైదరాబాద్ వెళ్లడానికి అవకాశం ఏర్పడుతుంది. నూజండ్ల మండలం వినుకొండ మండల ప్రజల ప్రతిరోజూ ప్రయాణానికి కష్టాలు తీరనున్నాయి.

మంత్రి శంకుస్థాపన

రూ. 21 కోట్లతో నిర్మించనున్న వంతెన నిర్మాణానికి పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుతో కలిసి శంకుస్థాపన చేశారు. దీంతో పాటు పువ్వాడలో ఇంటింటికి తాగునీరు అందించే పథకాన్ని ప్రారంభించారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జడ్పీటీసీ సభ్యుడు జడ్డా సుబ్బులు, నేతలు వంతెన నిర్మాణంపై హర్షం వ్యక్తం చేశారు.



పల్లెవెలుగు బస్సులో ప్రయాణిస్తున్న ఈడీ వెంకటేశ్వరరావు, పక్కన డీఎం రాంబాబు

ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు : ఈడీ

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : చిలకలూరిపేట ఆర్టీసీ డిపోను సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.వెంకటేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. బస్టాండ్ ఆవరణలో ఉన్న కార్గో పనితీరు, దుకాణంలో రేట్లు, క్యాంటీన్ పరిశీలించి రేట్లపై ఆరా తీశారు. గ్యారేజీ పరిశీలించి కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పల్లెవెలుగు బస్సు ఎక్కి ప్రయాణిస్తూ ప్రయాణికుల సమస్యలు తెలుసుకున్నారు. కళామందిర్ సెంటర్‌లో ఆర్టీసీ బస్సులు ఆగే ప్రాంతాన్ని పరిశీలించి సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తామని, వారి భద్రత, సౌకర్యాలపై ఆర్టీసీ ప్రత్యేక దృష్టి పెడుతుందన్నారు. కార్గో వ్యవస్థను మరింత విస్తృతం చేయనున్నట్లు వివరించారు. డిప్యూటీ డీపీటీవో శ్రీనివాసరావు, డీఎం రాంబాబు, సిబ్బంది ఉన్నారు.

ఆనంద దీపావళే లక్ష్యం



మాట్లాడుతున్న జేసీ సూరజ్ గనోరే, పక్కన ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : దీపావళి ఆనందంగా చేసుకునేలా చూడాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే అన్నారు. దీపావళి పురస్కరించుకుని బాణసంచా దుకాణాలకు అనుమతులు, భద్రతా చర్యలు తదితర అంశాలపై ఎస్పీ కె.శ్రీనివాసరావుతో కలిసి కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. జేసీ మాట్లాడుతూ ప్రభుత్వ నియమాలు పాటిస్తూ సంప్రదాయ బద్ధంగా పండగ చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధ్వని కాలుష్యం నివారించాలని, అనుమతులు లేని బాణసంచా విక్రయాలు చేయకుండా చూడాలన్నారు. బహిరంగంగా బాణసంచా విక్రయిస్తే కేసులు నమోదు చేయాలని, నిబంధనల ప్రకారం దుకాణాలకు అనుమతులు ఇస్తున్నారా లేదా అన్నది ఆర్డీవోలు పరిశీలించాలన్నారు. ఆర్డీవోలు బాణసంచా తయారీ కేంద్రాలు, నిల్వ చేసే గోదాములు పరిశీలించి అనుమతులు ఇవ్వాలని, గడువు ముగిసిన వాటికి రెన్యువల్ చేయాలన్నారు. విద్యుత్తు, పోలీసు, అగ్నిమాపక, మున్సిపల్, రెవెన్యూశాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఎస్పీ మాట్లాడుతూ టపాకాయలు విక్రయదారులు భద్రతా పరమైన నిబంధనలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. వివిధ శాఖల అధికారులున్నారు.

అధిక రసాయనాలతో దిగుబడి పతనం

గుంటూరు: పంటల సేద్యంలో రైతులు అధిక ఎరువులు, రసాయనాలు వినియోగించడంతో దిగుబడి తగ్గడంతో పాటు భూమి సారం కోల్పోతుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం లాంఫాం ఏడీఆర్ ఎన్‌వీవీఎస్ దుర్గాప్రసాద్ అన్నారు. గుంటూరుకు సమీపంలోని లాంఫాం ఆడిటోరియంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ప్రతినిధులకు సమగ్ర పోషక యాజమాన్యం అనే అంశంపై ఆంగ్రూ-గుంటూరు ఏరువాక కేంద్రం, సమేటి, మేనేజ్ సంయుక్త ఆధ్వర్యంలో 15 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. సమేటి రాష్ట్ర కార్యాలయం ఏడీఏ పుణ్యవతి, ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ విస్తరణ విభాగం సంచాలకుల కార్యాలయం ప్రధాన శాస్త్రవేత్తలు బి.ముకుందరావు, వి.విశాలాక్షి, తదితరులు ఎరువుల వినియోగంపై మాట్లాడారు.

అదుపులోకి అతిసారం

దాచేపల్లి, న్యూస్‌టుడే: దాచేపల్లి పట్టణం అంజనాపురం కాలనీలో మూడ్రోజులుగా విజృంభించిన అతిసారం అదుపులోకి వస్తోంది. కాలనీవాసులు ఇద్దరు మృతి చెందగా.. మరో ఎనిమిది మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. శుక్రవారం మరో మూడు కేసులు నమోదైనట్లు వైద్యాధికారులు తెలిపారు. అందరి ఆరోగ్యం నిలకడగానే ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, యంత్రాంగం అప్రమత్తమైంది. కాలనీలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, కలెక్టర్ అరుణ్‌బాబు, డీఎంహెచ్‌వో రవి, ఏపీవీపీ డీసీ రంగారావు తదితరులు శుక్రవారం కాలనీని సందర్శించారు. బాధితులను పరామర్శించారు. మృతుల కుటుంబాలను ఓదార్చి, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు.



తాగునీటి బోరు పరిశీలిస్తున్న మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే యరపతినేని, కలెక్టర్ అరుణ్‌బాబు

రెండ్రోజులుగా వైద్య శిబిరం

అంజనాపురం కాలనీలో రెండు రోజులుగా వైద్యశిబిరం కొనసాగుతోంది. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ బాధితులకు సేవలు అందిస్తున్నారు. డీఎంహెచ్‌వో రవి పర్యవేక్షిస్తున్నారు. జిల్లా మలేరియా అధికారి రత్నాకర్, హెల్త్ డైరెక్టర్ పద్మావతి కాలనీలో మంచి నీటి సరఫరాపై ఆరా తీశారు. ప్రజలందరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఆసుపత్రిలోని బాధితులను పరామర్శించారు.

పారిశుద్ధ్య చర్యలు ముమ్మరం

కాలనీలో రెండు రోజుల నుంచి నగర పంచాయతీ అధికారులు, సిబ్బంది ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కాలువల్లో పూడిక తొలగించారు. ఇళ్ల పక్కన ఖాళీ ప్రదేశాల్లోని పిచ్చి మొక్కలను తొలగించారు. రోడ్లకు ఇరువైపులా బ్లీచింగ్ చల్లారు. కమిషనర్ అప్పారావు పర్యవేక్షించారు.

మించాలపాడులో మూడు కేసులు

దుర్గి: మించాలపాడులో మూడు డయేరియా కేసులు నమోదవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. గ్రామంలో నాలుగు రోజుల కిందట అయిదుగురు విరేచనాలతో బాధపడుతుండగా ఆరోగ్య సిబ్బంది మాత్రలు పంపిణీ చేశారు. శుక్రవారం తురకా మంగమ్మకు అతిసారం సోకడంతో మాచర్ల ప్రభుత్వ వైద్యశాలలో చేరింది. అలాగే భానుప్రకాష్, అతడి తల్లి ఉమాదేవి దుర్గి ఆరోగ్య కేంద్రానికి వచ్చారు. వైద్యుడు పెద సైదులు పరీక్షించి, మెరుగైన చికిత్స నిమిత్తం మాచర్ల వైద్యశాలకు రెఫర్ చేశారు. ముటుకూరు ఆరోగ్యకేంద్రం వైద్యుడు శివరామకృష్ణ, సిబ్బంది మించాలపాడులో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. తాగునీటి నమూనాలు పరీక్షా కేంద్రానికి పంపారు.

సాగర్ 12 గేట్లు ఎత్తి నీటి విడుదల

విజయపురిసౌత్: సాగర్ జలాశయానికి వచ్చే నీటి చేరిక శుక్రవారం సాయంత్రానికి తగ్గుముఖం పట్టడంతో 12 క్రస్టు గేట్లు అయిదు అడుగులు ఎత్తి 96,324 క్యూసెక్కుల నీటిని దిగువ కృష్ణాకు విడుదల చేస్తున్నారు. కుడి కాలువకు 10,120, ఎడమ కాలువకు 6173, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు 2400, లోలెవల్ కెనాల్‌కు 400, సాగర్ ప్రధాన జలవిద్యుత్తు కేంద్రానికి 29,719 క్యూసెక్కులు వదులుతున్నారు. జలాశయ నీటిమట్టం 589.30 అడుగుల గరిష్ఠ స్థాయికి చేరింది.

పులిచింతలకు 1.83 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అచ్చంపేట: పులిచింతలకు వరద ప్రవాహం కొనసాగుతోంది. శుక్రవారం రాత్రి 7గంటలకు ఎగువ నాగార్జునసాగర్ పరివాహక ప్రాంతం నుంచి 1,83,910 క్యూసెక్కులు నీరు వచ్చి చేరిందని ఏఈఈ రాజు తెలిపారు. దిగువకు ప్రకాశం బ్యారేజికి 5 గేట్లు తెరచి 1,19,925 క్యూసెక్కులు, విద్యుత్తు ఉత్పత్తికి 16,000 క్యూసెక్కులు విడుదల చేశామన్నారు.

డ్రైవర్ పేరిట ఫైనాన్స్ సంస్థ ఏర్పాటు

దారి మళ్లించిన సొమ్ము అందులోకి బదిలీ

దర్యాప్తులో వెలుగుచూస్తున్న నాటి ఐసీఐసీఐ మేనేజర్ నరేష్ అక్రమాలు

విజయవాడ: ఐసీఐసీఐ బ్యాంకులో మేనేజర్ నరేష్ చేసిన కుంభకోణానికి సంబంధించి దర్యాప్తులో అనేక కీలక విషయాలు వెలుగు చూస్తున్నాయి. దీనిపై విచారణ చేస్తున్న గుంటూరు సీఐడీ అధికారులు అన్ని కోణాలను పరిశీలిస్తున్నారు. ఖాతాదారుల ఎఫ్‌డీలు, ఖాతాల్లోని నగదును సొంత అవసరాలకు దారి మళ్లించిన మేనేజర్ అక్రమాలపై సునిశిత దృష్టి సారించారు. నరసరావుపేట, చిలకలూరిపేట, విజయవాడలోని భారతీనగర్ బ్యాంకు శాఖల్లో కుంభకోణం వెలుగుచూసిన సంగతి తెలిసిందే. భారతీనగర్ శాఖలో బాధితులు దాదాపు 15 మంది వరకు ఉన్నట్లు తేలింది. నెల రోజుల నుంచి పరారీలో ఉన్న ఐసీఐసీఐ బ్యాంకు మేనేజర్ నరేష్ చంద్రశేఖర్ ఖాతాదారులు నుంచి కొల్లగొట్టిన డబ్బును నెక్సస్ గ్రోత్ అనే ఫైనాన్స్ సంస్థకు మళ్లించినట్లు సీఐడీ పోలీసులు గుర్తించారు. ఆ సంస్థను నరేష్ తన దగ్గర పని చేసే డ్రైవర్ ప్రభు శేఖర్ పేరు మీద ప్రారంభించినట్లు పోలీసుల విచారణలో తేలింది. నెక్సస్ గ్రోత్ అనే సంస్థ కార్యాలయంలో కూడా విజయవాడ ఐసీఐసీఐ బ్యాంకు ఉన్న భవనంలో ఉండటం గమనార్హం. శుక్రవారం ఈ సంస్థ వద్దకు సీఐడీ పోలీసులు వచ్చారు. ఆ సమయంలో మూసి ఉంది. కుంభకోణం బయట పడినప్పటి నుంచి మూసివేసినట్లు తెలిసింది. దీంతో కార్యాలయం గోడపై విచారణకు రావాలని సీఐడీ పోలీసులు నోటీసులు అందించారు. ప్రభు శేఖర్ సైతం పరారీ ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. ప్రభు శేఖర్ దుబాయ్ పరారీ అయ్యేందుకు గత నెలలో ఓ ముస్లిం మహిళను వివాహం చేసుకున్నట్లు సమాచారం.

కుటుంబ సభ్యుల ఫిర్యాదుపై మిస్సింగ్ కేసు

మేనేజర్ కుటుంబ సభ్యులు నరేష్ కనడపడటం లేదని విజయవాడ పటమట పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. గత నెల 26న నరేష్ హైదరాబాద్‌లో తనకు డబ్బులు రావాల్సి ఉందని వాటి కోసం వెళ్తున్నట్లు భార్య సరోజినికి తెలిపాడు. తండ్రి సురేష్‌కు వైద్యం చేయించేందుకు తనతో పాటు హైదరాబాద్‌కు తీసుకెళ్లాడని అనంతరం బాలానగర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారని చెప్పారు. 28న నరేష్ తన భార్య సరోజినికి వీడియో కాల్ చేసి హైదరాబాద్‌కు వచ్చిన పనులు అవట్లేదని బాధపడ్డాడు. ఆ రోజు నుంచి ఫోన్ స్విచాఫ్‌లో ఉన్నట్లు బంధువులకు కూడా నరేష్ ఆచూకీ తెలియదంటూ అతని భార్య ఫిర్యాదులో పేర్కొంది.

చారిత్రక కందకం పూడ్చివేత


పూడ్చక ముందు అగడ్త ఇలా..

యడ్లపాడు, న్యూస్‌టుడే : అక్రమార్కుల దెబ్బకు కొండవీడు రెడ్డిరాజుల కాలం నాటి చారిత్రక అగడ్త కనుమరుగయ్యే దుస్థితి నెలకొంది. యడ్లపాడు మండలం కోట గ్రామం ఉన్న చారిత్రక అగడ్త (కందకం)ను అదే గ్రామానికి చెందిన కొందరు అక్రమార్కులు పూడ్చారు. కోట గ్రామం వెలుపల అర్అండ్‌బీ రోడ్డు పక్కన అగడ్త ఇటీవల కురిసిన వర్షాలకు నీటితో నిండింది. దీనిపై అదే గ్రామానికి చెందిన కొందరి కన్ను పడింది. వారి ఆధ్వర్యంలో శుక్రవారం జేసీబీతో వచ్చి చారిత్రక మట్టికట్టను తవ్వి అగడ్తను పూడ్చారు. అర్అండ్‌బీ రోడ్డుకు సమాంతరంగా చదును చేశారు. పూడ్చిన చోట శాశ్వత కట్టడం నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. కందకం ఆక్రమణలకు గురి కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోట సర్పంచి హీఫీజ్ బేగ్ కోరారు. ఘటనపై తహసీల్దార్ విజయశ్రీని అడుగగా శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.


అక్రమార్కులు పూడ్చిన తర్వాత..

ప్రభుత్వ ఉద్యోగులు.. బినామీలకూ ఉపాధి చెల్లింపులు

ఈపూరులో ప్రజావేదిక కార్యక్రమంలో బయటపడ్డ అక్రమాలు

ఈపూరు, న్యూస్‌టుడే : ఈపూరు మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పథకం పనుల్లో భారీ అక్రమాలకు పాల్పడ్డారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు రూ.8.47 కోట్లు ఖర్చు చేసి చేపట్టిన 516 పనులను సామాజిక తనిఖీ బృందం తనిఖీ చేసి శుక్రవారం ఈపూరులో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో తనిఖీ నివేదిక వెల్లడించింది. డ్వామా పీడీ మటం సిద్ధలింగమూర్తి ఆధ్వర్యంలో ప్రజావేదిక నిర్వహించారు. డీఆర్పీలు తనిఖీ నివేదిక వెల్లడించారు. అంగన్‌వాడీ హోంగార్డు, అంగన్‌వాడీ ఆయాలు, గ్రామ వాలంటీర్ల పేర్లతో, కొండాయపాలెంలో క్షేత్ర సహాయకురాలికి, అగ్నిగుండాలలో గ్రామ వాలంటీరుకు, కొచ్చెర్లలో సచివాలయ ఉద్యోగికి ఉపాధి చెల్లింపులు చేసినట్లు గుర్తించారు. వనికుంట, కొచ్చెర్ల, ఊడిజర్లలో మృతుల పేర్లతో చెల్లించారు. ఈపూరు, బొగ్గరంలో ఎక్కువ పండ్ల మొక్కలు చూపి నిధులు చెల్లించారు. మండలంలో ఎక్కువ గ్రామాల్లో మస్తరులో సంతకాలు, వేలి ముద్రలు లేకపోయినా మస్తరు దిద్దుబాటు చేసి తమకు నచ్చిన వారి పేర్లు రాసుకుని చెల్లింపులు చేసినట్లు బయటపడింది. మొత్తం మీద రూ.5.13 లక్షలు అవినీతి జరిగినట్లు గుర్తించారు. కొచ్చెర్లలో బినామీలకు చెల్లింపులు చేశారని ఆరోపణలు రాగా విచారణకు ఏపీడీ బూసిరెడ్డిని ఆదేశించారు. లోపాలకు బాధ్యులైన వారినుంచి ఈ మొత్తాన్ని తిరిగి వసూలు చేయనున్నట్లు పీడీ వివరించారు. కార్యక్రమంలో ఏపీడీ బూసిరెడ్డి, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారిణి విజయకుమారి, ఎస్సార్పీ జేమ్స్ రాజు, ఏపీవో, ప్రభాకర రావు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న పీడీ సిద్ధలింగమూర్తి

ఎగిరొచ్చే సాయం

- సేద్యానికి సాంకేతిక ఊతం
- డ్రోన్ల వినియోగంపై సర్కారు దృష్టి

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే

డ్రోన్ల వినియోగంపై అధికారులు దృష్టి పెట్టాలి. అనవసర పురుగు మందుల వాడకాన్ని నివారించి, చీడ, పీడలున్న చోట మాత్రమే పిచికారీ చేసే విధానం అందిపుచ్చుకోవాలి.. ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డ్రోన్ల వినియోగంపై అధికారులకు ఇచ్చిన సూచన.

❖ వ్యవసాయాధారిత జిల్లాలో సేద్యానికి కూలీల కొరత ప్రధాన సమస్యగా మారింది. దీన్ని అధిగమించడానికి అన్నదాతలు డ్రోన్ల వినియోగం వైపు మొగ్గు చూపుతున్నారు. గత ప్రభుత్వం అయిదేళ్లు వ్యవసాయ రంగాన్ని పట్టించుకోక రైతులకు కనీసం యంత్ర పరికరాలు, వాటిపై రాయితీలు అందలేదు. కిసాన్ డ్రోన్ పథకం అంటూ హడావుడి చేశారు కానీ జిల్లాలో ఒక్కరికీ డ్రోన్ ఇవ్వలేదు.

పంట	సాధారణ విస్తీర్ణం (హెక్టార్లలో)
వరి	42,095
పత్తి	1,07,186
మిర్చి	58,202
కంది	19,259
మినుము	1,199
పెసర	213
ఇతరులు	20,196
మొత్తం	24,8350


డ్రోన్ ద్వారా మందు పిచికారి


డ్రోన్ల వినియోగంపై రైతులకు శిక్షణ ఇస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

రాయితీ ఇస్తారు..

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, సబ్‌మిషన్ ఆఫ్ అగ్రికల్చర్ మెకనైజేషన్ పథకాల ద్వారా 40 శాతం రాయితీ ఇస్తున్నారు. పది లీటర్ల సామర్థ్యం ఉన్న డ్రోన్ వ్యయం సుమారు రూ.10 లక్షలు కాగా కేంద్రం రూ.4 లక్షల రాయితీ ఇస్తుంది. బ్యాంకు రుణంగా రూ.5 లక్షలు ఇస్తారు. పది శాతం రైతు సంఘాలు లేదా స్వయం సహాయక సంఘాలు భరించాల్సి ఉంటుంది.

మహిళలకు దీదీ పథకం

నమో డ్రోన్ దీదీ పథకంలో భాగంగా కేంద్రం ఉచితంగా డ్రోన్లు అందజేస్తోంది. పొదుపు సంఘాలకు శిక్షణ ఇచ్చి వారికి డ్రోన్లు పంపిణీ చేస్తారు. ఫొటోగ్రఫీ, నిర్మాణ, రవాణా, వ్యవసాయం, విపత్తుల నిర్వహణలో వీటి సేవలు విస్తృతమవుతున్న నేపథ్యంలో స్థానిక యువతకు ఉపాధి కల్పనకు సర్కారు ప్రణాళిక రూపొందిస్తోంది. వీటిపై ఆసక్తి ఉన్న ఔత్సాహికులు, స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహిస్తోంది. డ్రోన్ల పంపిణీకి వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

వ్యవసాయ రంగంలో ఉపయోగం ఇలా..

సాధారణంగా ఎకరం పొలంలో పురుగు మందుల పిచికారీకి 4-5 గంటలు పడుతుంది. కూలీకి కట్టకు రూ.140 నుంచి 150 వరకు అంటే రూ.600 చెల్లించాలి. డ్రోన్ల యజమానులు రూ.400కే సేవలందిస్తున్నారు. ఎకరం పొలంలో ఈ ప్రక్రియ మొత్తం పది నిమిషాల్లోనే పూర్తవుతుంది. మొక్క అడుగు నుంచి పై వరకూ తడుస్తుంది. పంటలకు పురుగు మందులు, ఎరువుల పిచికారీకి రైతులు ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తోంది. అన్నదాతల ఆరోగ్యంపై ఇది ప్రభావం చూపుతుంది. డ్రోన్లకు అమర్చే కెమెరాతో పంటలను ఫొటో తీయడం, చీడపీడలు గుర్తించడం చేయవచ్చు. వాటిని వ్యవసాయాధికారులకు పంపి వారి సలహా మేరకు అరికట్టవచ్చు. స్ప్రేయర్లకు ఎకరాకు 200 లీటర్ల నీరు అవసరమైతే డ్రోన్‌తో 10 లీటర్లు నీరు సరిపోతుంది.

పిల్లల విక్రయంపై పోలీసుల విచారణ

నరసరావుపేటలో వెలుగుచూసిన ఘటన

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే : పట్టణంలో తొమ్మిది నెలల క్రితం బాలికను విక్రయించిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు, ఐసీడీఎస్ అధికారుల వివరాల ప్రకారం.. స్థానిక నిమ్మతోటకు చెందిన ఓ మహిళకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు సంతానం. మూడో సంతానమైన కుమార్తెకు పోలియో సోకింది. ఆమె నాలుగోసారి గర్భిణిగా ఉన్న సమయంలో ఆ బాలికను పోషించలేక.. ఆసుపత్రి ఆయా సాయంతో విజయవాడకు చెందిన ఆటో చోదకుడికి విక్రయించింది. ఇందుకు తల్లికి రూ.లక్ష, ఆయాకు కమీషనుగా రూ.20 వేలు వంతున అతను చెల్లించాడు. ఈ వ్యవహారంపై గుర్తుతెలియని వ్యక్తి ఆకాశరామన్న పేరుతో రాసిన ఉత్తరం ఉన్నతాధికారులకు చేరింది. దీని ఆధారంగా మహిళా పోలీసు స్టేషన్ సీఐ సుభాషిణి రంగంలోకి దిగి శుక్రవారం విచారణ చేపట్టారు. నరసరావుపేట నిమ్మతోట ప్రాంతానికి చెందిన ముగ్గురు మహిళలు కొన్నేళ్లుగా శిశువులను విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇందులో ఓ మహిళ చౌక దుకాణ నిర్వాహకురాలు కావడం గమనార్హం. బాలిక విక్రయంలో వీరి పాత్రపై పోలీసులు కూపీ లాగుతున్నారు. వినుకొండకు చెందిన మహిళ నుంచి కూడా ఇలాగే కొన్న బాలుడిని ఆసుపత్రి నర్సు ఒకరు పెంచుకుంటున్నట్లు వినికిడి. దీనిపై తాము కేసు నమోదు చేయలేదని, ప్రాథమిక సమాచారం మేరకు విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు.

అమ్మో... శునకాలు

పట్టణంలో హడలిపోతున్న ప్రజలు


చిలకలూరిపేట పట్టణంలోని బొందిలిపాలెం బజారులో కుక్కలు

చిలకలూరిపేట పట్టణం, గణపవరం, న్యూస్‌టుడే : చిలకలూరిపేట పురపాలక సంఘ పరిధిలో రోజురోజుకు పెరుగుతున్న కుక్కలతో ప్రజలు భయపడుతున్నారు. పట్టణంలోని ఏ వార్డులో చూసినా అవి స్వైర విహారం చేస్తున్నాయి. నిబంధనల పేరుతో అధికారులు వాటిపై చర్యలు తీసుకోకపోవడంతో వాటి సంఖ్య పెరుగుతోంది. ప్రతి వీధిలోనూ ఇవి యథేచ్ఛగా సంచరిస్తుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సెలవు రోజుల్లో, ఖాళీ సమయంలో విద్యార్థులు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. బజారుకు వెళ్లే సమయంలో వెంటపడుతుండటంతో ఇవి వెంటపడుతుంటే వాహనదారులు అదుపు తప్పి కింద పడి గాయపడుతున్నారు. చిన్న పిల్లలను, పశువులను, దూడలను కరుస్తున్నాయి. నాదెండ్ల మండలం గణపవరంలోని అంబేడ్కర్ కాలనీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వెనుక వైపు, చిన్న చర్చి ఎదురు బజారు, రాజీవ్‌గాంధీ కాలనీ, చౌటపాలెం, చాకలి బజారు, శాంతినగర్ తదితర ప్రాంతాల్లో కుక్కల బెడద అధికంగా ఉంది. సంబంధిత అధికారులు స్పందించి వాటిని పట్టి ఊరికి దూరంగా వదలాలని ప్రజలు కోరుతున్నారు.

ఉభయ రాష్ట్రాల స్థాయి సినీపాటల పోటీలు 27న

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం కళాపరిషత్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల స్థాయి సినీపాటల పోటీలు చిలకలూరిపేటలో ఆదివారం నిర్వహిస్తున్నట్లు పరిషత్ అధ్యక్షుడు జి.రాజకుమార్ ఓ సమావేశంలో శుక్రవారం తెలిపారు. స్థానిక పింఛనుదారుల సంఘ భవనంలో ఆదివారం ఉదయం 9 నుంచి పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద వరుసగా రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు, పది ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో జంపని భాస్కరరావు, కారుమంచి శివరావు, గొట్టిపాటి రామారావు పాల్గొన్నారు.

స్కేలింగ్ క్లౌడ్స్ ఫినాప్స్ పుస్తకావిష్కరణ

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : నరసరావుపేటకు చెందిన కనుమూరి రమేష్ రచించిన స్కేలింగ్ క్లౌడ్స్ ఫినాప్స్ పుస్తకాన్ని సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. తెదేపా మహిళా రాష్ట్ర అధికార ప్రతినిధి కనుమూరి రాజ్యలక్ష్మి, రమేష్ దంపతుల కుమారుడు శేఖర్ అమెరికాలో ఉంటూ పుస్తకాన్ని రాశారు. పుస్తకం ఇంజినీరింగ్ బృంద వ్యయ ఆప్టిమైజేషన్, క్లౌడ్ సామర్థ్యం పెంపు, డేటా ఆధారిత నిర్ణయాలు, స్థిరమైన, ఎంటర్‌ప్రైజ్ సాఫ్ట్‌వేర్ రంగంలో మెలకువలను మరింతగా సమర్థంగా పరుచుకునేందుకు ఈ పుస్తకం దోహదపడుతుందని రచయిత పేర్కొన్నారు. ఉన్నత విద్య విద్యార్థులకు, అభ్యసించే వారికి ఉపయోగకరంగా ఉంటుందని రాజ్యలక్ష్మి తెలిపారు. ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు సీఎంను కలిసిన వారిలో ఉన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు

అతిసారం మరణాలకు ప్రభుత్వానిదే బాధ్యత : మాజీ ఎమ్మెల్యే కాసు

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే : దాచేపల్లి అంజనాపురం కాలనీలో అతిసారంతో ఇద్దరు మృతి చెందిన సంఘటనకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని, ఐదు నెలల క్రితం పిడుగురాళ్ల పట్టణంలో కూడా ఐదుగురు మృతి చెందారని వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. నరసరావుపేటలోని తన ఇంట్లో ఆయన శుక్రవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మృతి చెందిన వారి ఒక్కొక్క కుటుంబానికి ప్రభుత్వం రూ.30 లక్షల వంతున సాయం అందించాలని, ఇళ్లకు పైపులైన్ల ద్వారా సరఫరా చేసే మంచినీరు కలుషితం కాకుండా చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, అధికారులు తమకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారని, బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా తాము ఎప్పుడూ ప్రజల పక్షాన పోరాడుతామని ఆయన చెప్పారు.

టెంపో వాహనం బోల్తా

ఒకరి మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు
రేషన్ బియ్యం తరలిస్తుండగా ఘటన

దాచేపల్లి, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రంలో సేకరించిన రేషన్ బియ్యాన్ని దాచేపల్లి వైపు తీసుకొస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం తెల్లవారుజామున మిర్యాలగూడెం నియోజకవర్గం వాడపల్లిలో జరిగింది. దాచేపల్లి పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 10 మంది టెంపో వాహనంలో మిర్యాలగూడెం వెళ్లారు. ఆ నియోజకవర్గంలో రేషన్ బియ్యం సేకరించి తిరుగు ప్రయాణం అయ్యారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో వాడపల్లి వద్ద టెంపో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. వాహనంలో ప్రయాణిస్తున్న దాచేపల్లికి చెందిన షేక్ నాగులా(40) అక్కడికక్కడే చనిపోయాడు. మరో ఇద్దరికి బలమైన గాయాలు అయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న రేషన్ మాఫియా సభ్యులు హుటాహుటిన అక్కడకు వెళ్లి మృతదేహాన్ని దాచేపల్లికి తీసుకొచ్చారు. గాయపడిన కోటేశ్వరరావు, సైదారెడ్డిని గుంటూరుకు తరలించి వైద్య సాయం అందిస్తున్నారు.


ఆందోళనకు దిగిన మృతుడి బంధువులకు నచ్చచెబుతున్న దాచేపల్లి పోలీసులు


నాగులా మృతదేహం

గుట్టు చప్పుడు కాకుండా..

రేషన్ మాఫియా సభ్యులు గుట్టు చప్పుడు కాకుండా మృతదేహాన్ని వాడపల్లి నుంచి దాచేపల్లికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న వాడపల్లి ఇన్‌ఛార్జ్ ఎస్సై తన సిబ్బందితో కలిసి దాచేపల్లికి చేరుకుని విచారించారు. కేసు విచారణలో భాగంగా నాగులా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించేందుకు ప్రయత్నించగా బంధువులు అడ్డుకున్నారు. బియ్యం మోయాలని చెప్పి రాత్రి తీసుకొని వెళ్లి, ఉదయం శవంగా తీసుకొచ్చి ఇంటి వద్ద పడేశారని బంధువులు పోలీసులతో వాదనకు దిగారు. రాస్తారోకో చేయాలని ప్రయత్నించారు. అదే సమయంలో మంత్రి సత్యకుమార్ దాచేపల్లికి వచ్చారు. రాస్తారోకో చేస్తే ఇబ్బందని స్థానిక పోలీసులు సర్దిచెప్పి వాడపల్లికి మృతదేహాన్ని తరలించారు.

రహదారి ప్రమాదంలో ఒకరి దుర్మరణం

రొంపిచర్ల, న్యూస్‌టుడే : అద్దంకి- నార్కెట్‌పల్లి రహదారిలో రొంపిచర్ల మార్కెట్ యార్డు సమీపంలో రోడ్డు దాటుతున్న ద్విచక్ర వాహనాన్ని కారు వేగంగా ఢీ కొట్టగా అతను మృతి చెందారు. ప్రమాదంలో మండలంలోని మునమాక ఎస్సీకాలనీకి చెందిన పి.శ్రీనివాసరావు (45) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. మునమాక ఎస్సీకాలనీకి చెందిన పి.శ్రీనివాసరావు రొంపిచర్లలో టైలర్. శుక్రవారం రాత్రి పని ముగించుకొని స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. స్థానిక మార్కెట్ యార్డు సమీపంలో రాష్ట్రీయ రహదారి దాటే క్రమంలో హైదరాబాద్ నుంచి ఒంగోలు వెళుతున్న కారు.. అతని వాహనాన్ని ఢీకొట్టగా శ్రీనివాసరావు గాలిలోకి లేచి రోడ్డు పక్కన లంకలో పడి దుర్మరణం చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. ద్విచక్ర వాహనం కారు ముందు భాగంలో ఇరుక్కుపోయింది. కారు వేగానికి లోపల ఎయిర్ బెలూన్స్ తెరుచుకున్నాయి. ఒక వైపు ఎయిర్ బెలూన్ పగిలిపోయింది. ఎస్సై అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక గ్రీవెన్స్

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : కలెక్టరేట్‌లో శనివారం ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా ప్రజా సమస్యల పరిష్కారవేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. ప్రతి నెల నాలుగో శనివారం ప్రత్యేకంగా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉదయం 10 గంటలకు అర్జీలు ఇవ్వవచ్చని పేర్కొన్నారు. షెడ్యూల్ కులాలు, తెగల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 120, రిటైల్ ధర - 142, చికెన్ విత్‌స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 125, 134, 145 చికెన్ విత్ స్కిన్ - 236 చికెన్ స్కిన్‌లెస్ - 246.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 540 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

నరసరావుపేట

•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

పథకాల పేర్లు మార్చిన అధికారులు


వైఎస్సార్ పేరు తీసేసి విలేజ్ క్లినిక్‌గా మార్చిన సిబ్బంది

ఈనాడు కథనానికి స్పందన

నూజండ్ల, న్యూస్‌టుడే : త్రిపురాపురంలో విలేజ్ క్లినిక్‌కు గత ప్రభుత్వంలో ఉన్న పేర్లను శుక్రవారం అధికారులు తొలగించారు. శుక్రవారం 'ఈనాడు'లో వచ్చిన ఆరోగ్య శాఖ నిర్లక్ష్యమా.. వైకాపాపై అభిమానమా? వార్తకు స్పందించిన ఆరోగ్య శాఖ అధికారుల ఆదేశానుసారం పంచాయతీ కార్యదర్శి సందీప్, ఏఎన్ఎం స్వాతి, డబ్ల్యుఈఏ నాగేశ్వరరావు కలసి వైఎస్సార్, జగన్ పేర్లు చిత్రాలు తొలగించారు.

కలుషిత నీరు సరఫరా అయితే సమాచారం ఇవ్వండి

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : పట్టణంలోని 34 వార్డుల పరిధిలో మంచినీరు రెండుపూటలా సరఫరా చేస్తున్నామని, తాగు నీటిని కాచి వడపోసి తాగాలని పురపాలక సంఘం కమిషనర్ జస్వంత్‌రావు శుక్రవారం తెలిపారు. మంచినీరు ఎక్కడైనా కలుషితమైనా, మురుగునీరు వచ్చినా వెంటనే పురపాలక సంఘంలోని ఫిట్టర్లకు తెలియజేయాలని ఆయన సూచించారు. దాచేపల్లిలో అతిసారంతో ఇద్దరు చనిపోయారని, ప్రజలు తాగు నీటి విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఆయన పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? యడ్లపాడు మండల పరిధిలో పీబీసీ కాలువ కట్టపై కంపచెట్లు పెరిగి రాకపోకలకు ఇబ్బంది మారింది. **- స్థానిక రైతులు**

✔ కాలువ మరమ్మతుల నిర్వహణకు నిధులు మంజూరు కాగానే కంపచెట్లు తొలగిస్తాం. **- సుధారాణి, జేఈ, పీబీసీ**

? బోయపాలెం- సంగంగోపాలపురం రోడ్డు అధ్వానంగా ఉంది. మరమ్మతులు నిర్వహించాలి. **- స్థానికులు**

✔ బోయపాలెం- సంగంగోపాలపురం రోడ్డుకు మరమ్మతులు నిర్వహిస్తాం. నిధులు రాగానే పనులు చేస్తాం. **- అరుణ, ఆర్అండ్‌బీ జేఈ**

- యడ్లపాడు, న్యూస్‌టుడే

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : విద్యుత్తు లైన్ల మరమ్మతుల దృష్ట్యా పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ డీఈఈ అశోక్‌కుమార్ తెలిపారు. స్థానిక సింగ్‌నగర్, సాంబశివనగర్, మండల పరిధిలోని పసుమర్రులో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రాగి తీగల చోరీ.. రైతుల్లో ఆందోళన

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే

రైతుల పొలాల్లో రాగితీగలు చోరీ చేస్తున్న ముఠాను పట్టుకున్నామని పోలీసులు చెబుతున్నా అవి ఆగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇందుకు చిలకలూరిపేట మండలంలో వరుసగా జరిగిన చోరీలు నిదర్శనంగా నిలుస్తున్నాయి. వారం క్రితం ఒక్క మురికిపూడిలోనే 30 మంది రైతుల పొలాల్లో దొంగలు రాగి తీగలను కోసుకుని వెళ్లిపోయారు. ఇదే పరిస్థితి గంగన్నపాలెంలోనూ నెలకొంది. గతంలో కావూరు, కమ్మవారిపాలెం, మద్దిరాల, కట్టుబడివారిపాలెం, యడవల్లి తదితర గ్రామాల్లో పొలాల వద్ద రైతులు జలసిరి బోర్లకు ఏర్పాటు చేసుకున్న సోలార్ ప్యానల్ బోర్డుల నుంచి బోరు వరకు వేసిన రాగి తీగలను చోరీ చేశారు. ఇప్పుడు రైతుల పొలాల్లో ఎక్కడ బోరు కనిపించినా రాగి తీగ చోరీ చేస్తున్నారు. దొంగలకు అది అమ్ముకుంటే వచ్చేది ఒక్కొక్క రూ.వెయ్యి లేదా రూ.రెండు వేలు మాత్రమే. కానీ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. తిరిగి బాగు చేసుకోవడానికి రూ.15 వేలు అవుతోంది. దీంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు దొంగలను పట్టుకోవాలని కోరుతున్నారు.


మురికిపూడిలో రాగితీగ చోరీ జరిగిన పొలం

తీవ్రనష్టం



అయిదేళ్ల క్రితం రూ.4.5 లక్షల విలువైన సోలార్ ప్యానెల్ పొలం వద్ద ఏర్పాటు చేసుకున్నాను. అప్పటి నుంచి విద్యుత్తుతో పని లేకుండా సోలార్ పంపుసెట్టు ఉపయోగించుకుంటున్నా. అయితే సోలార్ ప్యానల్ నుంచి బోరు మోటారు వరకు ఉన్న రాగి తీగను దొంగలు ఎత్తుకెళ్లారు. తిరిగి రూ.15 వేలు ఖర్చు చేసి మరమ్మతులు చేయించుకున్నారు. **- యర్రమాసు శ్రీహరిరావు, రైతు, కావూరు**

30 మంది రైతులు బాధితులు



మా పక్క గ్రామంలోనే 30 మంది రైతుల పొలాల్లో రాగి తీగ చోరీకి గురైంది. ప్రతి గ్రామాన్ని ఒక పోలీసుకు దత్తత ఇచ్చినా వారు కనీసం పట్టించుకోవడం లేదు. వరుసగా చోరీలు జరుగుతున్నాయి. పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. **- ముప్పసాని ఆదినారాయణ, మురికిపూడి**

టపాసుల వ్యాపారులపై దృష్టి పెట్టాలి

చిలకలూరిపేట పట్టణం : దీపావళి పండగ నేపథ్యంలో టపాసుల వ్యాపారులపై అధికారులు దృష్టి సారించాలని లోక్‌సత్తా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాదాసు భానుప్రసాద్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గతంలో వివిధ రాష్ట్రాల్లో టపాసులు నిల్వ ఉంచిన గూడెంలో, తయారీ కేంద్రాల్లో జరిగిన ప్రమాదాల వల్ల ఎంతోమంది చనిపోయారని చెప్పారు. ఆ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని దుకాణాలను తనిఖీ చేయాలని సూచించారు. ఎక్కువ ధరలు ముద్రించి ఏదో కొంత తగ్గించినట్లుగా చూపిస్తూ అమ్మటం పరిపాటిగా మారిందన్నారు. ఇప్పటికైనా వినియోగదారులు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆయన సూచించారు.

'సైబర్ నేరాల నియంత్రణ'పై వ్యాసరచన పోటీలు

నరసరావుపేట టౌన్ : జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో పోలీసు అమర వీరుల స్మారకోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశం మేరకు 'సైబర్ క్రైమ్ నేరాలు నియంత్రణలో యువత పాత్ర', 'ప్రస్తుతం సమాజంలో పోలీసులు ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశాలపై ఈ పోటీలు నిర్వహించినట్లు జిల్లా పోలీసు కార్యాలయ అధికారులు తెలిపారు.

విద్యార్థుల సృజనకు పదును


బహుమతులు, ధ్రువపత్రాలు అందుకున్న విద్యార్థులతో జడ్ఈవో హృదయరాజు, జడ్‌సీవో ప్రమీలారాణి


పోటీల్లో విద్యార్థులు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : 'ఈనాడు' ఆధ్వర్యంలో చిలకలూరిపేట పట్టణంలో భాష్యం ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభ నష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలైన జి.అంజిరెడ్డి, షేక్ సత్తార్, పి.సాగర్‌బాబుకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను పాఠశాల జడ్ఈవో ఎం.హృదయరాజు, జడ్‌సీవో ఎ.ప్రమీలారాణి, ప్రిన్సిపల్ ఎం.సునీల్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ రామ్‌కుమార్ అందజేశారు.

29 నుంచి నిరవధిక సమ్మె

వినుకొండ, న్యూస్‌టుడే : ఆరోగ్యమిత్రల కోర్కెల సాధనకు 29 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తున్నట్లు సంఘ నేతలు మాచర్ల బుజ్జి, కాకాని అప్పారావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులును కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మీరు ఇచ్చిన వినతిని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రికి పంపిస్తానని హామీ ఇచ్చారు. సంఘ నేతలు సింగంశెట్టి వెంకటేశ్వర్లు, నాగలక్ష్మి తదితరులున్నారు.

మహిళాభ్యున్నతికి తపాలా శాఖ పథకాలు

ఈపూరు, న్యూస్‌టుడే : మహిళాభ్యున్నతికి తపాలా శాఖ వివిధ పథకాలు ప్రవేశ పెట్టిందని శాఖ నరసరావుపేట డివిజన్ సహాయ పాలనాధికారి శివరామకృష్ణ తెలిపారు. ఇనుమెళ్లలోని బ్రాంచి తపాలా కార్యాలయాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు.

పాఠశాలలో మాక్ పోలింగ్

రొంపిచర్ల : వి.రెడ్డిపాలెం ఆదర్శ పాఠశాలలో దేశ్ అప్నాయన్ సహయోగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరు, ఏడు తరగతుల విద్యార్థులతో యాక్టిజెన్ క్లబ్ ఏర్పాటు చేశారు. క్లబ్ అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకోవటానికి శుక్రవారం మాక్ పోలింగ్ నిర్వహించినట్లు ప్రిన్సిపల్ బి.రవినాయక్ తెలిపారు.

పేదల ఆరోగ్యమే ప్రధానం

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : పేదల ఆరోగ్యాలను కాపాడేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అన్నారు. సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను శనివారం లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు.

కళాకేంద్రం దారి బంద్



వినుకొండ పురపాలక సంఘ కార్యాలయం ప్రాంగణంలోని కవి గుర్రం జాషువా కళా ప్రాంగణం ప్రధాన ప్రవేశమార్గం మూతపడింది. మెయిన్ గేటుకు తాళం వేసి ఉండటంతో బాటసారులు అక్కడే మూత్ర విసర్జన చేస్తున్నారని స్థానిక టైర్ల దుకాణం యజమాని టైర్లతో బారికేడ్ ఏర్పాటు చేశారు. దీంతో కళా కేంద్రం దారి బంద్ అయింది. **- వినుకొండ, న్యూస్‌టుడే**

ఇలా పడేస్తే వెళ్లేదెలా?

ఈపూరు, న్యూస్‌టుడే : మండలంలోని ఇనుమెళ్ల- ముప్పాళ్ల ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా రాళ్లకుప్పలు వేస్తుండటంతో రోడ్డు ఇరుకుగా మారి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రోడ్డు పక్కన భూముల రైతులు తమ పొలాల్లో మెరక చదును చేసుకుని రాళ్లు మట్టి తెచ్చి రోడ్డుపక్కన పడేస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.


రహదారి పక్కగా మట్టి కుప్పలు

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించండి


వైద్యసేవలపై ఆరా తీస్తున్న మండల ప్రత్యేకాధికారి సూర్యప్రకాశ్‌రెడ్డి

రొంపిచర్ల, న్యూస్‌టుడే : మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి సూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని అన్నవరంలో శుక్రవారం ఆయన పర్యటించారు. తొలుత సచివాలయాన్ని తనిఖీ చేసి దస్త్రాలు పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువ చేయాలన్నారు. గ్రామ హెల్త్ క్లినిక్ సెంటర్‌ను, ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఉప సర్పంచి భుజంగరావు, పీఎస్ కోటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

నాణ్యతలో రాజీ పడొద్దు

చిలకలూరిపేట గ్రామీణ : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజన పథకం నాణ్యతలో రాజీ పడొద్దని ప్రత్యేకాధికారి, ఇన్‌ఛార్జి డీఎస్‌వో బి.నారదముని పేర్కొన్నారు. మండలంలోని యడవల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి... రికార్డులు పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం నాణ్యత, మెనూ పరిశీలించారు. నాణ్యత లోపిస్తే నిర్వాహకులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. హెచ్ఎం ఎస్.నాగమల్లేశ్వరి, వీర్వో నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

మీదకొస్తాయ్.. కరుస్తాయ్..

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : మండలంలోని చిన్నతురకపాలెంలో కోతుల బెడద తీవ్రంగా ఉంది. సుమారు వందకు పైగా కోతులు గ్రామంలో సంచరిస్తూ చిన్నారులు, విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. పంట పొలాలపై పడి పంటలను నాశనం చేస్తున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. విద్యార్థుల భోజనం క్యారేజీలు లాక్కెళుతున్నాయని, బెదిరిస్తే కరుస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


ఇళ్ల ముందు కోతులు

బరంపేటలో రోడ్డు నిర్మించరూ..

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే : నరసరావుపేట బరంపేటలో పలు వీధుల్లో అంతర్గత రహదారులు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కొద్ది వర్షానికే మట్టిరోడ్లపై నీరు చేరి నడవలేక పోతున్నారు. అంతే కాక మురుగు వ్యవస్థ సరిగాలేదు. మురుగు ఇళ్ల ముందుకు వదులుతున్నారు. దీంతో రోడ్లపై, ఇళ్ల పక్కల మురుగు చేరి దోమలు ధాటికి ప్రజలు అల్లాడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు అంతర్గత రహదారులు, మురుగు వ్యవస్థ నిర్మించాలని కోరుతున్నారు.


అధ్వానంగా మట్టి రోడ్డు

నిర్వహణ లేదు.. నిర్లక్ష్యమే

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: తిమ్మాయిపాలెం పంచాయతీలో పలు వీధుల్లో చేతిపంపులు చెడిపోయాయి. నిర్వహణ గాలికొదిలేయడంతో శిథిలావస్థకు చేరుతున్నాయి. గ్రామానికి చివరన ఉన్న గడ్డమీద బజారులో ఉన్న చేతిపంపు ఆర్నెళ్లుగా మరమ్మతులకు గురైంది. వినుకొండ- దొండపాడు రోడ్డు పక్కనే ఆలయం సమీపంలో ఉన్న దాని చుట్టూ అధ్వానంగా ఉంది. దీనిపై ఈవోపీఆర్డీ సుందరరెడ్డిని అడుగగా త్వరలో బాగు చేయిస్తామని చెప్పారు.


మరమ్మతులకు గురైన చేతిపంపు

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


మాట్లాడుతున్న ఎస్సై ప్రియాంక, హాజరైన విద్యార్థులు

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే : క్రమశిక్షణతో విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఒకటో పట్టణ సీఐ విజయ్‌చరణ్ పేర్కొన్నారు. పోలీసుల అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా స్థానిక పాఠశాలలో శుక్రవారం 'సైబర్ నేరాల్లో యువత ముఖ్యపాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే సమాజంపై అవగాహన కలిగి ఉండాలని, పెరుగుతున్న నేరాలు, వాటి అంశాలపై పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై వంశీకృష్ణ తదితరులు ఉన్నారు.

మాదక ద్రవ్య రహిత సమాజం లక్ష్యం

నరసరావుపేట అర్బన్ : మాదక ద్రవ్యాల వినియోగం లేని సమాజమే నేటి యువత కర్తవ్యమని ఎస్సై ప్రియాంక తెలిపారు. స్థానిక ఎన్‌బీటీ ఎన్‌వీసీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ యువత వేగంగా విజయాలు సాధిస్తున్న పరిస్థితి ఒక వైపు, మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్న దుస్థితి మరో వైపు ఉందని చెప్పారు. సమాజంలో అనేక నేరాలకు మత్తు పదార్థాల వినియోగమే కారణమని పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని సాధనకు కృషి చేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్.శ్రీనివాసరావు, డాక్టర్ దీప, డాక్టర్ నయీం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మానవహారం



బొల్లాపల్లి పాఠశాల విద్యార్థుల మానవహారం

బొల్లాపల్లి, వినుకొండ, న్యూస్‌టుడే : ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా శుక్రవారం బొల్లాపల్లిలో రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మానవహారం నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి కె.పార్వతి మాట్లాడుతూ పోలియో రహిత సమాజం కోసం ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తున్నట్లు చెప్పారు. క్లబ్ అధ్యక్షుడు గుమ్మా శ్రీకాంత్‌రెడ్డి, బాధ్యులు ఆలా శ్రీనివాసరావు, షేక్ మస్తాన్, రాజారెడ్డి, రమేష్, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జొన్నలగడ్డ విద్యార్థులు

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీల్లో భాగంగా అండర్- 17, 19 జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీల్లో జొన్నలగడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం మల్లికార్జునరావు శుక్రవారం తెలిపారు. అండర్- 17 విభాగంలో ఎం.బిందుప్రియ, రాణి, శశికుమార్, అండర్- 19 విభాగంలో బి.విజయలక్ష్మి, దేవాప్రసన్నకుమార్, జోత్స్న 26 నుంచి 28 వరకు ఎన్టీఆర్ జిల్లానున్న పాఠశాలలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. శిక్షణ ఇచ్చిన పీఈటీ సునీల్‌ను, విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.


విద్యార్థులతో హెచ్ఎం మల్లికార్జునరావు, పీఈటీ సునీల్

ప్రజా ఉపయోగ పనులకు ప్రాధాన్యం

నూజండ్ల : ఉపాధి హామీ పథకం నూరుశాతం సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ జయరామిరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం క్షేత్ర సహాయకులు, కార్యదర్శులు, సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ప్రజలకు ఉపయోగపడే పనులు గుర్తించాలని కోరారు. ఏపీవో ఆంజనేయరాజు, ఏఈ అల్లాభక్షు, భాస్కరరెడ్డి సిబ్బంది ఉన్నారు.

అవీ ఇవీ

విశ్రాంత ఉపాధ్యాయినికి సన్మానం

చిలకలూరిపేట పట్టణం : చిలకలూరిపేట పురపాలక సంఘ పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయిని తంగేళ్ల భూలక్ష్మిని సాదినేని చౌదరయ్య పాఠశాలలో శుక్రవారం సన్మానించారు. డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ భూలక్ష్మి తనకు వచ్చే పింఛనులో 40 శాతం వరకు పేద విద్యార్థులకు సాయం చేస్తున్నట్లు తెలిపారు. పండరీపురం రోటరీ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. పాఠశాల డైరెక్టర్, కరస్పాండెంట్ పి.వీరనారాయణ, ధనలక్ష్మి గ్రూపు ఆఫ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ ఎం.లింగయ్య చౌదరి, స్కూలు డైరెక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భాజపా నేత పుట్టినరోజు వేడుక

వినుకొండ రూరల్ : దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వంతో పాటు ప్రైవేటు సంస్థలు కూడా చేయూత ఇవ్వాలని భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి మేడం రమేష్ అన్నారు. శుక్రవారం ఆయన పుట్టినరోజు వేడుకలు విఠంరాజుపల్లిలోని దివ్యాంగ పాఠశాల విద్యార్థులతో కలిసి చేసుకున్నారు. కేకు కోసి, వారికి భోజనం వడ్డించారు. పలువురు పాల్గొన్నారు.

అటవీ జాతి మొక్కల పెంపకంతో ఆదాయం

యడ్లపాడు, న్యూస్‌టుడే : సాగు భూముల్లో అడవి జాతి మొక్కలు పెంచితే అదనపు ఆదాయం లభిస్తుందని ట్రీస్ అవుట్ సైడ్ ఫారెస్టు ఇన్ ఇండియా (టీవోఎఫ్ఐ) సంస్థ ప్రతినిధి అనిల్ అన్నారు. మండలంలోని కారుచోల, కొండవీడులో శుక్రవారం టీవోఎఫ్ఐ ఆధ్వర్యంలో అటవీయేతర ప్రాంతంలో చెట్ల పెంపకంపై శుక్రవారం నిర్వహించిన రైతు శిక్షణ సదస్సులో ఆయన మాట్లాడారు.

విద్యార్థిని మృతిపై విచారణ చేయాల్సిందే

చిలకలూరిపేట గ్రామీణ : గుంటూరు నగరంలోని రెడ్డిపాలెం శ్రీ చైతన్య పాఠశాలలో చదువుతున్న 8వ తరగతి విద్యార్థిని మృతిపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేపట్టి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ చిలకలూరిపేట నియోజకవర్గ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం కార్యాలయ సీనియర్ సహాయకుడు మస్తాన్‌వలికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్ఎఫ్ఐ నాయకులు మేకపోతుల నాగేశ్వరరావు, మెగావత్ సాయినాయక్, మధు, యాసిన్, భగత్‌సింగ్, ఆరాధ్యుల రామకృష్ణ, తన్నీరు వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోడి పందేలు ఆడుతున్న ఏడుగురి అరెస్ట్

వినుకొండ రూరల్ : కోడి పందేలు ఆడుతున్న వారిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. దొండపాడు వద్ద పట్టణ సీఐ శోభన్ బాబు ఆదేశాల మేరకు ఎస్సై సమీర్ బాషా సిబ్బందితో వెళ్లి దాడులు చేశారు. కోడిపందేలు ఆడుతున్న ఏడుగురిని పట్టుకుని, రూ.16,750, నాలుగు కోళ్లు, 20 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

నాదెండ్ల : మండలంలోని సాతులూరులో వ్యభిచార గృహంపై పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ముగ్గురు మహిళలతో పాటు ఓ ట్రాన్స్‌జెండర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

పశువుల సంతలో తనిఖీలు

చిలకలూరిపేట గ్రామీణ : పట్టణంలోని నరసరావుపేట రహదారిలో ఉన్న ఎంఆర్ పశువుల సంతలో పశు సంవర్ధక శాఖ ఏడీ శ్రీనివాసరావు, పురపాలక సంఘ కమిషనర్ శ్రీహరిబాబు, అర్బన్ సీఐ రమేష్ తనిఖీలు చేశారు. ఒక లారీలో ఐదు పశువులను తరలిస్తున్నట్లు గుర్తించి రూ.2,300 అపరాధ రుసుం విధించారు.

సీపీఎం నేత మృతికి సంతాపం

చిలకలూరిపేట గ్రామీణ : మండలంలోని బొప్పూడికి చెందిన సీపీఎం సీనియర్ నేత బొల్లు శంకరరావు (71) శుక్రవారం మృతి చెందారు. రైతాంగ సమస్యల పరిష్కారానికి ఆయన కృషి చేశారు. ఆయన మృతికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్సీ రాజశేఖర్, సీపీఎం, సీపీఐ నేతలు సంతాపం తెలిపారు.

'పొగాకు రహిత సమాజానికి యువత కృషి'

అమీన్‌సాహెబ్‌పాలెం (నాదెండ్ల) : భవిష్యత్తులో పొగాకు రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా యువత కృషి చేయాలని ఎంఏఎం ఫార్మసీ కళాశాల ప్రధాన అధ్యాపకుడు ఎం.ప్రసాదు అన్నారు. నాదెండ్ల మండలం అమీన్‌సాహెబ్‌పాలెంలో కేసానుపల్లి ఎంఏఎం ఫార్మసీ కళాశాల విద్యార్థులు పొగాకు వ్యతిరేక అవగాహన ప్రదర్శనను శుక్రవారం నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం కొల్లి పద్మజ, ఉపాధ్యాయుడు కనకయ్య, కార్యక్రమ నిర్వహణాధికారి కార్తీక్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నరసరావుపేట అర్బన్ : ఎంఏఎం ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అవిశాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో పొగాకు వినియోగంతో అనర్థాలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ధూమపానాన్ని నిరుత్సాహ పరచటమే లక్ష్యంగా ఇది ఏర్పాటు చేసినట్లు కళాశాల ఛైర్మన్ ఎమ్మార్ శేషగిరిరావు పేర్కొన్నారు.

శావల్యాపురం తహసీల్దారుగా సుజాత

శావల్యాపురం : శావల్యాపురం తహసీల్దారుగా కె.సుజాత నియమితులయ్యారు. ఈమేరకు డీఆర్వో వినాయకం ఉత్తర్వులు జారీ చేశారు.

మెకానికల్ రంగంలో ఉపాధి అవకాశాలు

నరసరావుపేట అర్బన్ : ప్రస్తుతం దేశంలో మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని వక్తలు తెలిపారు. జేఎన్‌టీయూ కళాశాలలో ఆటోమొబైల్ కార్యశాల నిర్వహించారు. షియాగో సర్వీసెస్ హెడ్ శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ ఫణిసుష్మ తదితరులు ఉన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించొద్దు

నరసరావుపేట సెంట్రల్ : ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దని జిల్లా వ్యవసాయాధికారి, మండల ప్రత్యేక అధికారి మురళీ అన్నారు. మండలంలోని దొండపాడు గ్రామంలోని సచివాలయాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఏవో నరేంద్రబాబు, వ్యవసాయ విస్తరణ అధికారి బ్రహ్మయ్య, వ్యవసాయ సహాయకులు ఉన్నారు.

చీడపీడలపై అవగాహన తప్పనిసరి

వినుకొండ : పంటలకు ఆశించే చీడపీడలపై రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని రైతు శిక్షణ కేంద్రం జిల్లా సమన్వయకర్త ఎం.శివకుమారి తెలిపారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని రైతు సేవా కేంద్రం సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పలు సూచనలు చేశారు.

సత్తెనపల్లి

•సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

నూతన ఆర్టీసీ బస్సులు ప్రారంభం


బస్సు నడుపుతున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

మాచర్ల (కారంపూడి): మాచర్ల డిపోలో 8 నూతన బస్సులను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా కొత్త బస్సులను సమకూరుస్తున్నట్లు తెలిపారు. డిపో నుంచి బెంగళూరు, చెన్నై, మంగళగిరిలోని ఎయిమ్స్‌కు బస్సులను ఏర్పాటు చేశామని తెలిపారు. డిపో మేనేజరు వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన కన్నా


పార్టీ నాయకులను పరిచయం చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం సీఎంఓలో ముఖ్యమంత్రి చంద్రబాబును కూటమి పార్టీల నియోజకవర్గ నాయకులు కలిశారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో పార్టీ విజయానికి నాయకులు చేసిన కృషిని ముఖ్యమంత్రికి కన్నా వివరించారు. నాయకులు రామస్వామి, శౌరయ్య, శ్రీనివాసరావు, వెంకటకోటయ్య, కోటేశ్వరరావు, జనసేన నియోజకవర్గ నాయకుడు వెంకటఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
మాచర్ల గ్రామీణ: 80085 73181 గురజాల: 80085 7 3176

? లక్కరాజుగార్లపాడు ఎస్సీకాలనీ చర్చి వద్ద మురుగు కాలువలో పూడిక నిండి, నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది.
- జంగాల శ్రీనివాస్, కాలనీ నివాసి

✔ కాలువ పూడిక తీయించి సమస్య పరిష్కరిస్తాం. **- వెంకటేశ్వర్లు, కార్యదర్శి**
– న్యూస్‌టుడే, సత్తెనపల్లి గ్రామీణ

? రాత్రి వేళ గ్రామంలో వీధి దీపాలు వెలగడం లేదు. **- నరసింహారావు, గంగిరెడ్డిపాలెం**

✔ పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటాం. **- లక్ష్మారెడ్డి, కార్యదర్శి**
- న్యూస్‌టుడే, మాచవరం

? పట్టణంలోని మారుతీ మహల్ వెనుక ప్రాంతంలోని మూడో వీధిలో కొన్ని రోజుల నుంచి మురుగు కాలువల్లో పూడిక తీయడం లేదు. **- నాగేశ్వరరావు, పిడుగురాళ్ల**

✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి పారిశుద్ధ్య కార్మికులతో మురుగు కాలువను బాగు చేయిస్తాం.
- పి.శ్రీధర్, మున్సిపల్ కమిషనర్
- న్యూస్‌టుడే, పిడుగురాళ్ల

? తండాలో వీధి దీపాలు వెలగట్లేదు.
- రామ్‌నాయక్, శ్రీరాంపురంతండా

✔ తొందర్లో వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం.
- ప్రసాద్, కార్యదర్శి

? మురుగు నీరు ఇళ్ల ముందు నిల్వ చేరి, దుర్వాసనతోపాటు, దోమలకు ఆవాసంగా మారింది. **- సైదమ్మ, శివలింగాపురం**

✔ త్వరలో సమస్యను పరిష్కరిస్తాం.
- చంద్రయ్య, కార్యదర్శి
– న్యూస్‌టుడే, వెల్దుర్తి

? దైదలోని ఎస్సీ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. **- ఎస్సీ కాలనీవాసులు**

✔ వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. **- గురుప్రసాద్, కార్యదర్శి**
– న్యూస్‌టుడే, గురజాల గ్రామీణ

మట్టిలో మాణిక్యాలు

- క్రీడల్లో పల్నాడు విద్యార్థుల సత్తా
- రాష్ట్ర, జాతీయ పోటీలకు ఎంపిక

మాచర్ల (కారంపూడి), పిడుగురాళ్ల, న్యూస్‌టుడే

వారందరిదీ గ్రామీణ నేపథ్యం.. పేద మధ్య తరగతి కుటుంబాల పిల్లలు. . ఓవైపు చదువులో రాణిస్తూనే.. క్రీడల్లోనూ సత్తా చాటుతున్నారు. వివిధ ఆటల్లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పతకాల పంట పండిస్తున్నారు. ఖోఖో, సాఫ్ట్‌బాల్ క్రీడల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, అసోసియేషన్ గేమ్స్‌లో జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు.

పేరు : ఆలేటి కార్తిక్ (10వ తరగతి)
పాఠశాల: సెయింటాన్స్
తల్లిదండ్రులు : కాటయ్య, కుమారి
గ్రామం: కొత్తపల్లి



ప్రాతినిధ్యం: 2023లో మహారాష్ట్రలోని ఔరంగబాద్‌లో జరిగిన 38వ సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ రాష్ట్ర జట్టు తరపున పాల్గొని బంగారు పతకం సాధించాడు. 2024లో రాజస్థాన్ రాష్ట్రంలోని గుల్బర్గాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్స్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ పోటీల్లో ఆంధ్రజట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. సాఫ్ట్‌బాల్ **ఆంధ్రా** అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెలలో నంద్యాలలో జరిగిన జాతీయ పోటీల్లో పాల్గొన్నాడు. రాష్ట్రజట్టు మూడో స్థానం సాధించడంలో కీలక భూమిక వహించాడు.

లక్ష్యం: ఇంజినీరింగ్ విద్యాభ్యాసం చేసి రైతులకు ఉపయుక్తమైన పరికరాలను తయారు చేయాలన్నదే లక్ష్యమని చెప్పాడు.

పేరు : బద్దెల రైన్‌పాల్ (9వ తరగతి)
పాఠశాల: బ్రహ్మనాయుడు జడ్పీ ఉన్నత
తల్లిదండ్రులు: రవికుమార్, ప్రియాంకిని
గ్రామం: కారంపూడి



ప్రాతినిధ్యం: 2023లో ఝార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జరిగిన 14 ఏళ్లలోపు ఖోఖో విభాగంలో ఆంధ్ర జట్టు తరపున ప్రాతినిధ్యం వహించాడు. ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో 2024లోనూ ఝార్ఖండ్ రాష్ట్రంలో జరిగిన సబ్‌జూనియర్స్ విభాగంలో పాల్గొన్నాడు. ప్రస్తుతం చిత్తూరు జిల్లా కాణిపాకంలో జరుగుతున్న అసోసియేషన్ పోటీల్లో జిల్లా జట్టు తరపున పోటీ పడుతున్నాడు.

లక్ష్యం: ఐఏఎస్ కావాలన్న దీక్షతో విద్యాభ్యాసంతోపాటు మానసికోల్లాసానికి ఖోఖో వైపు మొగ్గు చూపినట్లు చెబుతున్నాడు. పట్టుదలతో క్రీడలోని మెలకువలను నేర్చుకున్నానన్నాడు. ఖోఖోలో జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకుంటానని చెబుతున్నాడు.

పేరు: అగస్త్య ఆనంద్ (8వ తరగతి)
పాఠశాల: సెయింటాన్స్
తల్లిదండ్రులు : రవిశేఖర్, రాణి
గ్రామం : మాచర్ల



ప్రాతినిధ్యం: 2023లో గుంటూరు జిల్లా వెనిగళ్లలో నిర్వహించి 14 ఏళ్లలోపు సాఫ్ట్‌బాల్ విభాగంలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. 2024లో నరసరావుపేట మండలం మునగపాడులో జరిగిన రాష్ట్ర పోటీల్లో పాల్గొన్నాడు. నవంబరులో జమ్మూకాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు సన్నద్ధమవుతున్నాడు.

లక్ష్యం: డాక్టర్‌గా పేదలకు సేవ చేయాలన్న లక్ష్యమని చెబుతున్నాడు. చదువులో వ్యాయామం భాగం కావడంతో సాఫ్ట్‌బాల్ వైపు మొగ్గు చూపి మెలకువలను నేర్చుకున్నట్లు పేర్కొన్నాడు.

విద్యార్థి పేరు: రెల్లా లోకేష్ (7వ తరగతి)
పాఠశాల: తిరుమల ఆక్స్‌ఫర్డ్
ఊరు: పిడుగురాళ్ల



ప్రాతినిధ్యం: లోకేష్ చెస్ పోటీల్లో సత్తా చాటుతున్నాడు. ఈ ఏడాది స్కూల్‌గేమ్స్ పోటీల్లో మండల స్థాయిలో ప్రథమ, నియోజకవర్గ పోటీల్లో ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. జిల్లా స్థాయిలోనూ సత్తా చాటి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 29, 30 తేదీల్లో అనంతపురంలో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొననున్నాడు. **లక్ష్యం:** జాతీయ స్థాయిలో ఆడాలనే లక్ష్యం ఉందని చెబుతున్నాడు.

బేకరీలో నిల్వ మాంసం

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: పట్టణంలోని రింగురోడ్డు సెంటర్లోని ఓ బేకరీలో కుళ్లిన స్థితిలో నిల్వ ఉంచిన మాంసంను మున్సిపల్ అధికారులు గుర్తించారు. పట్టణంలో అతిసారం, విషజ్వరాలు వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో పలు హోటళ్లు, బేకరీలను ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ గౌతమి నేతృత్వంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఓ బేకరీలో నిల్వ చేసిన మాంసాన్ని విక్రయిస్తున్నట్లు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని మొదటి తప్పుగా సిబ్బందిని హెచ్చరించి వదిలేశారు.

వృత్తి విద్యలో నైపుణ్యాలు అలవర్చుకోవాలి

అచ్చంపేట, న్యూస్‌టుడే: విద్యార్థులు వృత్తి విద్యలో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎస్‌బీఐ మేనేజరు జయభారతి కోరారు. శుక్రవారం ఆమె స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల విద్యార్థులకు బ్యాంకింగ్, డిజిటల్ సేవలు వివరించారు.

కేసీపీలో భద్రత వారోత్సవాలు

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: కేసీపీ మైన్స్‌లో శుక్రవారం భద్రత వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. మేనేజర్ వెంకటరమణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ఫ్యాక్టరీ యాజమాన్యం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రమాద రహిత మైన్స్‌ను కార్మికులు, ఉద్యోగుల నేతృత్వంలో తీర్చిదిద్దిందన్నారు.

నియంత్రిక తీసుకెళితే బెదిరింపులు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: విద్యుత్తు నియంత్రికను మరమ్మతుల నిమిత్తం కార్యాలయానికి తీసుకెళ్లిన రైతును ఓ అధికారులు దూషించి, బెదిరించిన ఘటనపై శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై సమందర్‌వలి వివరాల ప్రకారం.. రచ్చమల్లపాడు గ్రామానికి చెందిన రైతు మల్లయ్య పొలంలోని రెండు నియంత్రికలను వారం రోజుల కిందట దొంగలు ధ్వంసం చేసి, రాగి తీగ, ఆయిల్‌ను చోరీ చేశారు. మరుసరోజు ఉదయాన్నే పొలానికి వెళ్లిన రైతు విషయాన్ని సంలబంధిత అధికారులకు చెప్పారు. విద్యుత్తు అధికారుల సూచనల మేరకు మాచర్ల కార్యాలయానికి నియంత్రిక మరమ్మతులకు తీసుకెళ్లారు. అయితే మరమ్మతులు చేయకుండా సిబ్బందిని కృష్ణా జిల్లాకు చెందిన ఓ సబ్‌ఇంజినీరు అడ్డుకుంటున్నారని, రూ.20 వేలు ఇవ్వాలంటూ ఫోన్ చేసి బెదిరిస్తున్నారంటూ రైతు ఫిర్యాదు చేశాడని ఎస్సై తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎస్సీ బాలికల వసతి గృహం సందర్శన

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎస్సీ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని గురజాల పీడీఎం కోర్టు న్యాయమూర్తి సత్యనారాయణ శుక్రవారం సందర్శించారు. వసతి పొందుతున్న బాలికలకు అక్కడ ఎలాంటి సౌకర్యాలు ఉన్నాయో న్యాయమూర్తి అడిగి తెలుసుకున్నారు. వైద్యపరీక్షలు సక్రమంగా చేస్తున్నారా? ఆహారం రుచిగా పెడుతున్నారా అంటూ ఆరా తీశారు. ఇతర సమస్యలు ఏమైనా ఉన్నాయా అంటూ న్యాయమూర్తి బాలికలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పట్టణ సీఐ వెంకట్రావు తదితరులు ఉన్నారు.

రైల్వే లైన్‌తో రాజధానికి మహర్దశ

పెదకూరపాడు, న్యూస్‌టుడే: అమరావతికి నూతన రైల్వేలైన్ నిర్మాణంతో రాజధాని ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు రూ.2,245 కోట్లతో 57 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్రం నిర్ణయం తీసుకుందన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోండి

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక బస్టాండ్ ప్రాంతంలో ఆయన మాట్లాడుతూ తెదేపా ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు.

తాళ్లచెరువు(అచ్చంపేట): రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని ఓట్ల నమోదుపై శుక్రవారం తాళ్లచెరువు, అచ్చంపేటలో తెదేపా నేతలు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు.

అతిసారంతో జాగ్రత్త

రెంటచింతల, న్యూస్‌టుడే: అతిసారంపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు సూచించారు. జెట్టిపాలెం ఆదర్శ పాఠశాల, ఆరోగ్యకేంద్రం, సచివాలయాన్ని తనిఖీ చేశారు. పాఠశాలలో పరిశుభ్రత పాటించాలి. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఎంపీడీఓ సరోజినిదేవి, ఎంఈఓ శివనాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతిభతో మెరిశారు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో పట్టణంలోని స్కాలర్స్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీలకు విద్యార్థుల నుంచి విశేషస్పందన లభించింది. అంతర్జాల వినియోగం లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై 8,9,10వ తరగతి విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ బి.లక్ష్మీ (పదోతరగతి), ద్వితీయ సీహెచ్ శ్రీలక్ష్మీత్రివేణి (పదోతరగతి), తృతీయ బహుమతి డి.నాగేశ్వరరావు (ఎనిమిదో తరగతి) సాధించారు. ఉపాధ్యాయులు జె.ప్రకాష్, జి.నరేంద్రరెడ్డి, ఎస్.కె. కనిష్‌బాషా, బి.శ్రీనివాసరావు విజేతలకు బహుమతులు అందజేశారు.


వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు



బహుమతులు అందుకున్న విద్యార్థులు

క్రీడల్లోనూ రాణించాలి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: చదువుతోపాటు ఇష్టమైన క్రీడల్లోనూ విద్యార్థులు రాణించి ప్రయోజకులు కావాలని పట్టణ ఎస్సై సంధ్యారాణి అన్నారు. స్థానిక శరభయ్య గుప్తా హైందవోన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం ఏర్పాటు చేసిన భాష్యం పాఠశాలల క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. గెలుపోటములను క్రీడాకారులు సమానంగా స్వీకరించాలని, క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందించుకోవాలన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ సుందరరావు, పీఈటీ రాజేష్, కిరణ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకు శుభ్రం

స్పందనకు వందనం

దుర్గి, న్యూస్‌టుడే: ఓబులేశునపల్లె యాదవ వీధిలోని తాగునీటి ట్యాంకును శుభ్రం చేశారు. ట్యాంకు పాచి పట్టి, నీరు కలుషితం కావడంతో 'పాచిపట్టిన తాగునీటి ట్యాంకు' శీర్షికన 'ఈనాడు'లో ఇచ్చిన ఫొటో కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. బ్లీచింగ్ వేసి శుభ్రం చేయించారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

అచ్చంపేట, న్యూస్‌టుడే: మండలంలోని దుకాణదారులు అధిక ధరలకు ఎరువులను అమ్మితే చర్యలు తీసుకుంటామని క్రోసూరు ఏడీఏ హనుమంతరావు హెచ్చరించారు. శుక్రవారం ఆయన అచ్చంపేటలోని పలు దుకాణాలను ఏవో వెంకటేశ్వర్లుతో కలిసి తనిఖీ చేశారు.

కాచి చల్లార్చిన నీటిని తాగాలి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పట్టణంలోని 31 వార్డులకు పురపాలక సంఘం నుంచి రోజూ రక్షిత తాగునీటి సరఫరా చేస్తున్నామని, కాచి చల్లార్చిన తరువాతే నీటిని తాగాలని కమిషనర్ కె.షమ్మి ప్రజల్ని కోరారు. తాగునీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. పైపులైన్ల లికేజీలు ఉంటే సమాచారం ఇవ్వాలన్నారు.

సభ్యత్వ నమోదుతో గుర్తింపు

కారంపూడి, న్యూస్‌టుడే: తెదేపా సభ్యత్వాలు ఎక్కువ మొత్తంలో చేయించిన కార్యకర్తలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వెల్దుర్తి, మాచర్ల పట్టణం, కారంపూడి మండలం ఒప్పిచర్ల గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాలను ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి శనివారం ప్రారంభిస్తారన్నారు. ఇదే క్రమంలో కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అర్హులతో ఓటు నమోదు చేయించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని చర్లగుడిపాడులో శుక్రవారం గ్యార్మీ పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం మాబుసుబాని జెండాచెట్టు వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాయంత్రం జెండాలను ఊరేగించారు. భక్తులు పంచదార, బెల్లం చదివించి మొక్కులు చెల్లించారు.

పారదర్శకంగా పశు గణన

సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: పశు గణన సర్వే పారదర్శకంగా చేపట్టినట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకుడు డాక్టర్ రామారావు తెలిపారు. నందిగామ, గుడిపూడిలో జీవాలకు నట్టల నివారణ మందు పంపిణీ ప్రక్రియను ఆయన శుక్రవారం పరిశీలించారు. పశు గణన వేగవంతం అయ్యేందుకు పశు పోషకులు సిబ్బందికి సహకరించాలన్నారు. సహాయ సంచాలకుడు శ్రీనివాసరావు, పశు వైద్యాధికారి శిరీష, సిబ్బంది పాల్గొన్నారు.


నందిగామలో వైద్యం అందిస్తున్న తీరు పరిశీలిస్తున్న ఉపసంచాలకుడు రామారావు

పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెరగాలి

రాజుపాలెం, న్యూస్‌టుడే: పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య పెంచేలా వైద్యాధికారులు, సిబ్బంది దృష్టి సారించాలని వైద్యారోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ సుచిత్ర సూచించారు. రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె శుక్రవారం తనిఖీ చేసి టీకాలు నిల్వ, కాన్పులు, పార్మసి, రక్త పరీక్ష గదులను, రికార్డులను పరిశీలించారు. వైద్యాధికారి రవితేజనాయక్‌కు పలు సూచనలు చేశారు.


రికార్డులను పరిశీలిస్తున్న సుచిత్ర

అమ్మవారికి పూజలు

దుర్గి, న్యూస్‌టుడే: పల్నాట ప్రసిద్ధిచెందిన శ్రీనిదానంపాటి అమ్మవారిని శుక్రవారం మాచర్ల, గురజాల, నరసరావుపేట ఎమ్మెల్యేలు జూలకంటి బ్రహ్మారెడ్డి, యరపతినేని శ్రీనివాసరావు, అరవిందబాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ వంశపారంపర్య ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు, ఆలయ ఏసీ, ఈవో సైదమ్మబాయి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రెంటచింతల మండలం రెంటాల గ్రామానికి చెందిన వెన్నా శ్రీనివాసరెడ్డి ఎన్నికల ముందు తెదేపా గెలుపుతోపాటు, ఆయన స్నేహితుడు యరపతినేని శ్రీనివాసరావు, బంధువు జూలకంటి బ్రహ్మారెడ్డి ఎమ్మెల్యేలుగా విజయం సాధిస్తే అమ్మవారి ఆలయం వద్ద భారీగా అన్నదానం చేస్తానని మొక్కుకున్నారు. ఆ కోర్కెలు నెరవేరడంతో అన్నదానం చేశార


అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యేలు బ్రహ్మారెడ్డి, యరపతినేని, అరవిందబాబు

భూగర్భాన్ని జల బ్యాంకుగా మార్చేద్దాం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ఆకాశంపై నుంచి జాలు వారే ప్రతి వర్షపు చుక్కను.. ఇంట్లో నుంచి వృథాగా మురుగు కాలువల్లో కలిసే నీటిని ఒడిసిపట్టేందుకు 'ఈనాడు' 'సుజలాం.. సుఫలాం' నింపిన స్ఫూర్తితో చేపట్టిన ఇంకుడు గుంతల నిర్మాణం జల ఉద్యమానికి దీప్తిగా మారింది. 2016 ఏప్రిల్ 28వ తేదీ నుంచి మే 2 వరకు ఐదు రోజుల్లోనే సత్తెనపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా 50 వేల ఇంకుడు గుంతల నిర్మాణాలు పూర్తి చేశారు. మాజీ సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు సారథ్యంలో అన్ని గ్రామాలు, పట్టణంలో ఉద్యమంలా ఉపాధి హామీ నిధులతో ఇంకుడు గుంతల నిర్మాణాల్ని చేపట్టారు. సత్తెనపల్లి స్ఫూర్తితో చిలకలూరిపేట, వినుకొండ, గురజాల, నరసరావుపేట నియోజకవర్గాల్లోనూ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకువచ్చి జల సంరక్షణకు ఇళ్లల్లో ఇంకుడు గుంతలు తవ్వుకున్నారు. అయితే జల సంరక్షణ గత వైకాపా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఫలితంగా మళ్లీ భూగర్భ జలానికి ఇబ్బంది వచ్చింది. జిల్లాలో భూగర్భ జలం 12 మీటర్ల దిగువకు వెళ్లింది.


'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ఇంకుడు గుంతలు తవ్వుకుంటున్న ప్రజలు (పాత చిత్రం)

కూటమి ప్రభుత్వం చొరవ: భూగర్భాన్ని జల బ్యాంకుగా మార్చుకునే అవకాశాన్ని మళ్లీ కూటమి ప్రభుత్వం కల్పించింది. మండలానికి వెయ్యి చొప్పున ఇంకుడు గుంతల నిర్మాణాన్ని లక్ష్యంగా నిర్దేశించారు. కొంత స్థలం ఉండి ఇంకుడు గుంతలు నిర్మించుకునేందుకు ముందుకొచ్చే వారికి ఉపాధి హామీ పథకం నిధుల్ని అందజేస్తారు. ఒక్కో గుంత నిర్మాణానికి రూ.6 వేలు చొప్పున కేటాయించారు. సామగ్రి కొనుగోలుకు రూ.5,450, కూలీల వేతనాలకు రూ.550 చెల్లించాల్సి ఉంటుంది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ నుంచి నిధులు మంజూరయ్యాయి. ప్రణాళికను సిద్ధంచేసి వెంటనే పనులు ప్రారంభించాలని నరేగా క్షేత్ర, సాంకేతిక సహాయకులు, ఈసీ, ఏపీవో, ఏపీడీ, ఎంపీడీవోలకు మార్గదర్శకాలు చేశారు. ప్రజల భాగస్వామ్యం ఇంకుడు గుంతల నిర్మాణంలో కీలకం కానుంది. ఇళ్ల ఆవరణతోపాటు వీధుల్లో నీరు ఎక్కువగా నిలబడే ప్రదేశాల్లో గుంతల్ని నిర్మించనున్నారు. వచ్చే జనవరిలోపు లక్ష్యాల్ని పూర్తి చేయాలనే సూచనలు అందాయి. దీంతో డ్వామా ఉద్యోగులు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. జిల్లాలోని 28 మండలాల్లో 28 వేల ఇంకుడు గుంతల నిర్మాణాల్ని రూ.16.80 లక్షల నిధులతో చేపట్టనున్నారు.

89 మందికి ఉద్యోగావకాశాలు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 89 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి రవీంద్రనాయక్ తెలిపారు. మొత్తం 136 మంది అభ్యర్థులు హాజరైనట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి, నైపుణ్యాభివృద్ధి సిబ్బంది పి.శ్రీకాంత్, వీరాంజనేయులు, మస్తాన్, రామాంజనేయులు, ఏపీఎం కోటేశ్వరరావు, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 నుంచి 9 వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్తు శాఖ సిబ్బంది తెలిపారు. కొండమోడులోని విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

టెయిల్‌పాండ్ 12 గేట్లు ఎత్తివేత

రెంటచింతల, న్యూస్‌టుడే: సత్రశాల టెయిల్‌పాండ్ జలాశయం 12 గేట్లు ఎత్తినట్లు జెన్‌కో ఎస్‌ఈ వెంకటరమణ తెలిపారు. ఎగువనున్న సాగర్ జలాశయం నుంచి 1,25,759 క్యూసెక్కుల వరద నీరు జలాశయంలోకి వచ్చి చేరుతోంది. రిజర్వాయరు నిల్వ సామర్థ్యం 7,50 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 6,860 టీఎంసీల వరకు నిల్వ చేశారు.

జిల్లాస్థాయి రెజ్లింగ్ జట్ల ఎంపిక

అచ్చంపేట, న్యూస్‌టుడే: జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో జిల్లాస్థాయి రెజ్లింగ్ (కుస్తీ) పురుషుల, స్త్రీల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఆ వివరాలను అసోసియేషన్ జిల్లా కార్యదర్శి భూషణం వెల్లడించారు. పురుషుల జట్టులో కె.లాలూనాయక్, ఆర్.శ్రీహరి, దయాకర్, సుధాకర్, సత్యనారాయణనాయక్, పుల్లయ్య, వంశీ, కుమారస్వామి, మరియరాజు, కిరణ్‌కుమార్, మల్లికార్జున, రాజేష్, పెదరాయుడు, నరేంద్ర, విజయకుమార్, రత్నకుమార్, మహిళల జట్టుకు ఆర్.ప్రమీలాబాయి, అఖిల్, దనుకుబాయి, దేవమణి, నిశిపా, శ్రుతి ఎంపికయ్యారు.


ఎంపికైన క్రీడాకారులు

సౌర విద్యుత్తుపై అవగాహన

దాచేపల్లి, న్యూస్‌టుడే: సౌర విద్యుత్తుతో ఎంతో ప్రయోజనం ఉందని ఉమ్మడి గుంటూరు జిల్లా నోడల్ అధికారి సింగయ్య తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పీఎం సోలార్ ఘర్ పథకంపై స్థానిక కళ్యాణ మండపంలో మండల విద్యుత్తు శాఖ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే రాయితీల గురించి వివరించారు. పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీఈఈ వీరేశ్వరరావు, ఏఈలు భగవాన్ నాయక్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఉమ్మడి గుంటూరు జిల్లా నోడల్ అధికారి సింగయ్య

పేలుడు పదార్థాలు తరలించే వ్యక్తుల అరెస్టు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పేలుడు పదార్థాలను అనుమతులు లేకుండా తరలించిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ వెంకట్రావు చెప్పారు. శుక్రవారం పట్టణంలోని పోలీసుస్టేషన్ ఆవరణలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 18న హైదరాబాద్ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా పేలుడు పదార్థాలు తీసుకువస్తున్న వాహనాన్ని పిడుగురాళ్లలోని బైపాస్‌లో పోలీసులు పట్టుకున్నారు. అందులో 25 బాక్సుల జిలెటిన్ స్టిక్స్, బూస్టర్ స్టిక్స్‌ను స్వాధీనం చేసుకుని, డ్రైవర్ అంజయ్యను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. డ్రైవర్‌ను విచారించగా గామాలపాడుకు చెందిన వెన్నా రాజశేఖరరెడ్డి, పాతగణేశునిపాడుకు చెందిన మహమ్మద్ ఆసిఫ్ తమ లైసెన్సులను అడ్డుపెట్టుకుని హైదరాబాద్ నుంచి బిల్లులు లేకుండా అక్రమంగా పేలుడు పదార్థాలు తీసుకొచ్చి, అనుమతుల్లేని క్వారీ యజమానులకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. వాడపల్లిలోని మల్లేష్ ఇంటికి శుక్రవారం వెళ్లి 15 బాక్సుల జిలెటిన్ స్టిక్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మల్లేష్, మహ్మద్ ఆసిఫ్‌ను అరెస్టు చేసినట్లు ఆయన వివరించారు. వెన్నా రాజశేఖరరెడ్డి పరారీలో ఉన్నాడని, అతడిని కూడా త్వరలో పట్టుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో ఎస్సైలు శివగారాజు, హెడ్‌కానిస్టేబుల్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


పేలుడు పదార్థాలున్న వాహనం, నిందితులతో పోలీసులు

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర పద్మావతి చెప్పారు. శుక్రవారం కామేపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ శోభారాణి ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్ల పనితీరుపై ఆరా తీశారు. గర్భిణులకు సకాలంలో వైద్యపరీక్షలు చేయాలని చెప్పారు.

పోలీసుస్టేషన్‌కు సీసీ కెమెరాల అందజేత

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేయడానికి గుదె వెంకటేశ్వరరావు శుక్రవారం 12 సీసీ కెమెరాలు పట్టణ సీఐ వెంకట్రావుకు అందజేశారు. వీటి విలువ సుమారు రూ.56 వేలు ఉంటుంది. ప్రధాన కూడళ్లు, ప్రాంతాల్లో కెమెరాలు ఏర్పాటు చేయడానికి పోలీసులు దాతలను ఆశ్రయించారు.

తాగునీటి పథకం పరిశీలన

కస్తల(అచ్చంపేట), న్యూస్‌టుడే: మండలంలోని కస్తలలో ఏర్పాటు చేసిన సమగ్ర రక్షిత మంచినీటి పథకానికి మరమ్మతులు చేసి అందుబాటులోకి తేవాలని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్... ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి పథకాన్ని సందర్శించారు. ఫిల్టర్ల శుభ్రపరచడం, మరమ్మతులు చేసి గ్రామాలకు నీటిని అందించాలని సూచించారు. డీఈఈ ఎం.రాజు, ఏఈఈ మల్లికార్జునరావు, పర్యవేక్షకుడు శ్రీనివాసరెడ్డి, ఆదయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకులో మెరుగైన సేవలు

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: గురజాలలోని ఏర్పాటు చేసిన కెనరా బ్యాంకు నూతన శాఖను శుక్రవారం జోనల్ మేనేజర్ విజయలక్ష్మి ప్రారంభించారు. తమ బ్యాంకుల ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

దాచేపల్లి, న్యూస్‌టుడే: ఇటీవల డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అవార్డును అందుకున్న దాచేపల్లి పట్టణం నారాయణపురంలోని వికాస్ కళాశాల ప్రధానోపాధ్యాయులు, సర్వసతి డిగ్రీ కళాశాల డైరెక్టర్ శ్రీనివాసరావుకు మండల యూటీఎఫ్ ఆధ్వర్యంలో సన్మానించారు. నాయకులు రాజారావు, శాంతారావు, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

శిథిల భవనం.. నిత్యం భయం

క్రోసూరు(అచ్చంపేట), న్యూస్‌టుడే: క్రోసూరులో బ్రిటిష్ కాలం నాటి భవనంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నిర్వహిస్తున్నారు. భవనం పైకప్పు దెబ్బతింది. వర్షానికి చిత్తడిగా మారుతోంది. పెంకులపై టార్పాలిన్ పట్ట కప్పి మమఅనిపించారు. ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే ఈ కార్యాలయానికి సరైన భవనం లేకపోవడంతో క్రోసూరు, అచ్చంపేట మండలాల నుంచి భూ రిజిస్ట్రేషన్‌కు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే విలువైన దస్త్రాలు తడిసిపోతాయని ఆందోళన చెందుతున్నారు.


సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవనం దుస్థితి

ఈనాడు ప్రతిభ
pratibha.eenadu.net/eenadupratibha.net
విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

ప్రాక్టీస్ బిట్స్ — డీఎస్సీ 2024 - చరిత్ర

1. కిందివాటిలో తప్పుగా ఉన్న వాక్యం-
   1) అనేక రకాల కులాలు, వర్గాలు ఉండే గ్రామాలు - భోజక గ్రామాలు.
   2) హస్తకళలు, చేతివృత్తులు ఉండే గ్రామాలు - పట్టణ గ్రామాలు.
   3) అటవీ ప్రాంతం సమీపంలో ఉన్న గ్రామాలు - సరిహద్దు గ్రామాలు.
   4) పాళీ గ్రంథాల ప్రకారం ప్రజలు వ్యవసాయ పంటలకు దూరంగా నివాసం ఉండేవారు.
   1) 1, 4 2) 3 3) 2 4) 4
2. అటవీ ప్రాంతాలను చదును చేసి వ్యవసాయ యోగ్యంగా మార్చినవారు?
   1) వైశ్యులు 2) సైనికులు 3) శూద్రులు 4) క్షత్రియులు
3. జనపదాల కాలంలో ఎన్ని రకాల చేతివృత్తులు ఉండేవి?
   1) 4 2) 6 3) 64 4) 46
4. జనపదాల కాలంలో ముఖ్యమైన వర్తక శ్రేణులు ఎన్ని?
   1) 8 2) 18 3) 16 4) 46
5. క్రీ.పూ.6వ శతాబ్దంలో ఏ లోహంతో చేసిన నాణేలు అధిక సంఖ్యలో ఉండేవి?
   1) రాగి 2) బంగారం 3) వెండి 4) ఇనుము

సమాధానాలు: 1-4; 2-3; 3-3; 4-2; 5-3.

ప్రిపరేషన్ టెక్నిక్
వాయిదా వేయడాన్ని వదిలేయాలి. అన్ని పాఠాలను ముందుగానే చదువుకోవాలి. రివిజన్ చేసుకోవాలి. పరీక్షలప్పుడు చివరి నిమిషంలో హడావిడి పరిస్థితులను సృష్టించుకోవడం అంత మంచిది కాదు.

డీఎస్సీ - 2024 ఇంగ్లిష్ కంటెంట్

ఆంధ్రాలో అభ్రకం.. రాజస్థాన్‌లో రాగి!

జనరల్ స్టడీస్ - ఇండియన్ జాగ్రఫీ

ఒక ప్రాంత సహజ సంపదలో ఖనిజాలు అత్యంత విలువైనవి. నిర్మాణ సామగ్రి, ఎలక్ట్రానిక్స్, పారిశ్రామిక వినియోగాలతోపాటు ఆభరణాల నుంచి అధునాతన ఆయుధాల వరకూ అన్నింటి తయారీకి అవే ముడిసరకులు. లోహ, అలోహ, ఇంధన రూపాల్లో ఆర్థిక అభివృద్ధి సాధనాలుగా విస్తృత ప్రయోజనాలను అందిస్తున్నాయి. పారిశ్రామిక అవసరాల్లో కీలకమైన వెండి, రాగి, మాంగనీస్, బాక్సైట్, సీసం, మైకా మొదలైన వాటితోపాటు విలువైన బంగారం, వజ్రాలూ భారత్‌లో దొరుకుతున్నాయి. దేశవ్యాప్తంగా వీటి డిమాండ్, లభ్యత, వెలికితీత, వినియోగం, ఎగుమతి-దిగుమతి తీరుతెన్నులపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. ఖనిజ సంపన్న రాష్ట్రాల విశేషాలను తెలుసుకోవాలి.

మరికొన్ని ఖనిజాలు

దేశంలో 2020-21 లెక్కల ప్రకారం 95% ఖనిజాలు ఉత్పత్తి అవుతున్నాయి. తక్కువ నిల్వలు ఉంటే దిగుమతి చేసుకుంటూ, ఎక్కువ నిల్వలు ఉన్న వాటిని ఎగుమతి చేస్తున్నారు. భారత్‌లో చోటానాగపుర్, ప్రపంచ వ్యాప్తంగా జర్మనీలోని రూర్‌లోయ ప్రాంతాల్లో అధిక ఖనిజ నిల్వలు ఉన్నాయి.

మాంగనీస్: ఇది లోహ ఖనిజం. దీన్ని ఇనుము-ఉక్కు, విద్యుత్తు పరిశ్రమల్లో; గ్లాస్, బ్లీచింగ్ పౌడర్, క్రిమిసంహారిణుల తయారీల్లో; ఇంకా పరిశ్రమల్లో ఆక్సీకరణ కోసం ఉపయోగిస్తారు. ప్రస్తుతం దేశంలో సరిపడా నిల్వలు లేకపోవడంతో దిగుమతి చేసుకుంటున్నారు. మాంగనీసు ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలో 6వ స్థానంలో ఉంది. నిల్వల పరంగా చూస్తే ప్రపంచంలో 2వ స్థానంలో ఉంది. మొదటి స్థానం జింబాబ్వే. దేశంలో నిల్వల పరంగా ఒడిశా (44%), కర్ణాటక (22%), మధ్యప్రదేశ్ (12%), గోవా, మహారాష్ట్ర (7%); ఆంధ్రప్రదేశ్ (4%), ఝార్ఖండ్ (2%), రాజస్థాన్, గుజరాత్, పశ్చిమ బెంగాల్ (2%) వరుస స్థానాల్లో ఉన్నాయి. ఉత్పత్తి పరంగా మధ్యప్రదేశ్ (32%), మహారాష్ట్ర (27%), ఒడిశా (19%), కర్ణాటక (14%), ఆంధ్రప్రదేశ్ (8%) ముందంజలో ఉన్నాయి. దేశంలో 2023లో 2.8 మిలియన్ మెట్రిక్ టన్నుల మాంగనీస్ ఉత్పత్తి జరిగింది. భారత్ ఎక్కువ నాణ్యత ఉన్న మాంగనీసును దిగుమతి చేసుకుంటూ, తక్కువ నాణ్యమైన దాన్ని ఎగుమతి చేస్తోంది. ఇక్కడ నుంచి ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్న దేశం జపాన్. దేశంలో అత్యంత పురాతన మాంగనీసు గని శ్రీకాకుళం (1892)లో ఉంది. తెలంగాణలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ ఖనిజ నిల్వలు ఉన్నాయి.


మాంగనీస్

రాగి (కాపర్): పారిశ్రామికంగా ఇనుము తర్వాత ముఖ్యమైన ఖనిజం రాగి. ఇది సాధారణంగా వెండి, సీసం, ఇనుము మొదలైన వాటితో కలిసి దొరుకుతుంది. ఈ లోహాన్ని ప్రధానంగా విద్యుత్తు పరికరాల తయారీకి, టెలిఫోన్, టెలిగ్రామ్ మొబైల్ ఫోన్ల తయారీలో మిశ్రమ లోహంగా వాడుతున్నారు. ఈ ఖనిజం సాధారణంగా సల్ఫైడ్, కార్బొనేట్‌గా దొరుకుతుంది. దేశంలో రాగి నిల్వలు 1,511 మిలియన్ టన్నులు ఉన్నట్లు అంచనా. ఎక్కువగా రాజస్థాన్‌లోని ఖేత్రీలో 813 మిలియన్ టన్నులు ఉండగా, ఝార్ఖండ్ (295 మి.ట.), మధ్యప్రదేశ్ (283 మి.ట.) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, గుజరాత్, హరియాణా, కర్ణాటక, మహారాష్ట్ర, మేఘాలయ, నాగాలాండ్, ఒడిశా, సిక్కిం, తమిళనాడు, తెలంగాణ, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్‌ల్లోనూ కొద్ది మొత్తంలో నిల్వలు ఉన్నాయి. రాగి ఉత్పత్తిలో మధ్యప్రదేశ్ (62%), రాజస్థాన్ (29%), ఝార్ఖండ్ (8%)లు ముందున్నాయి. దేశీయ అవసరాలు, డిమాండ్ అధికంగా ఉండటంతో అమెరికా, కెనడా, జింబాబ్వే, జపాన్, మెక్సికో నుంచి ఎక్కువగా దిగుమతి అవుతోంది.


రాగి

క్రోమైట్: దీన్ని రసాయనాలు, స్టెయిన్‌లెస్ స్టీలు, ఖనిజ ఆధారిత పరిశ్రమల్లో ఉపయోగిస్తారు. ఇది ముఖ్యంగా ఆక్సైడ్ రూపంలో లభిస్తుంది. దేశంలోని మొత్తం క్రోమైట్ నిల్వల్లో 90% ఒడిశాలో ఉన్నాయి. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కొద్ది నిల్వలు ఉన్నాయి. భారత్ నుంచి క్రోమైట్ ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్న దేశాలు జపాన్, ఆస్ట్రేలియా.


వజ్రాలు: భూమిలో లభించే అత్యంత దృఢమైన పదార్థం వజ్రం. భారత్‌లో మధ్యప్రదేశ్‌లోని 'పన్నా' ప్రాంతం వజ్రాలకు ప్రసిద్ధి. వజ్రాల నిల్వలు, ఉత్పత్తిలో మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. ప్రపంచ ప్రసిద్ధి చెందిన కోహినూర్ వజ్రం ఆంధ్రప్రదేశ్‌లోని కొల్లూరు గనుల నుంచి వెలికితీశారు. 2023 లెక్కల ప్రకారం భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద వజ్రాల ఎగుమతిదారు.


వజ్రాలు

బాక్సైట్: దీన్ని అల్యూమినియం తయారీలో వాడతారు. దేశంలో బాక్సైట్ నిల్వల్లో ఒడిశా, ఆంధ్రప్రదేశ్ మొదటి రెండు స్థానాల్లో; ఉత్పత్తిలో ఒడిశా, గుజరాత్ ముందంజలో ఉన్నాయి. ఇక్కడి ఖనిజం ఇటలీ (60%), యూకే (25%), జర్మనీ (9%), జపాన్ (9%)కు ఎగుమతి అవుతోంది.


బాక్సైట్

బంగారం: దీన్ని 'నోబెల్ మెటల్' అంటారు. దేశంలో ఉత్పత్తయ్యే బంగారం ప్రపంచ బంగారు ఉత్పత్తిలో 1% కంటే తక్కువ. ప్రపంచ వ్యాప్తంగా బంగారు నిల్వలు అధికంగా చైనా, ఆస్ట్రేలియా, రష్యా, అమెరికా (యూఎస్ఏ), కెనడాలో ఉండగా; వినియోగంలో చైనా, భారత్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. దేశీయంగా బంగారు ఖనిజ నిల్వలు 527.96 మిలియన్ టన్నులు (2015 లెక్కల ప్రకారం). నిల్వల పరంగా బిహార్ (44%), రాజస్థాన్ (25%), కర్ణాటక (21%), పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్ కలిపి (3%) ఉన్నాయి. బంగారు ఖనిజంలో బంగారు శాతం పరంగా కర్ణాటక తొలి స్థానంలో నిలిస్తే, రాజస్థాన్, బిహార్, ఆంధ్రప్రదేశ్, ఝార్ఖండ్‌లు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.


బంగారం

వెండి: బంగారం తర్వాత ఖరీదైన లోహం వెండి. భారత్‌లో బంగారం, రాగి ఖనిజాలతోపాటు వెండి దొరుకుతుంది. దీన్ని నాణేలు, నగలుగా వాడటంతో పాటు ఫొటోగ్రఫీ, రసాయన పరిశ్రమల్లో ఉపయోగిస్తారు. ఈ లోహం అజెంటైన్, స్టెపనైట్, ప్రోస్టేట్ మూలకాల నుంచి దొరుకుతుంది. వెండి ఉత్పత్తిలో అగ్ర దేశం మెక్సికో. తర్వాతి స్థానం చైనా. భారత్ 12వ స్థానంలో ఉంది. ఇక్కడ వెండి నిల్వలు డిమాండ్‌కు సరిపడినంత లేవు. దేశంలోని వెండి నిల్వల్లో రాజస్థాన్ 86%, కర్ణాటక 5%, ఝార్ఖండ్ 4%, ఆంధ్రప్రదేశ్‌లో 3% ఉన్నాయి. రాజస్థాన్‌లోని ఉదయ్‌పుర్ జిల్లా జావర్ గనుల నుంచి ఎక్కువగా ఉత్పత్తి జరుగుతోంది. ఇంకా కర్ణాటక (కోలార్ గనులు), బిహార్‌లోని సింగ్‌బమ్, హిమాచల్‌ప్రదేశ్‌లోని సట్లెజ్ లోయలో వెండి విరివిగా దొరుకుతుంది. ఆంధ్రప్రదేశ్‌లోని కడప, కర్నూలు, గుంటూరు జిల్లాల్లోనూ లభ్యమవుతోంది.

సీసం, జింక్: వెండి, కాడ్మియం ఒకేచోట దొరికినట్లుగా సీసం, జింక్ ఒకేచోట లభిస్తాయి. దీన్ని సంగీత వాయిద్య పరికరాలు, ఆటోమొబైల్స్, విమానాలు, విద్యుత్తు పరికరాల తయారీల్లో ఉపయోగిస్తారు. దేశంలో ముఖ్యంగా రాజస్థాన్‌లోని ఉదయ్‌పుర్ జిల్లా జావర్ గని నుంచి, ఉత్తర్‌ప్రదేశ్‌లోని డెహ్రాడూన్, హిమాచల్‌ప్రదేశ్‌లోని పార్వతీ లోయ, ఆంధ్రప్రదేశ్‌లోని కడప, కర్నూలు, గుంటూరు; తెలంగాణలోని ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో లభిస్తుంది.

అభ్రకం (మైకా): ప్రపంచ మైకా ఉత్పత్తిలో భారత్ అగ్రస్థానంలో ఉంది. ప్రపంచ వ్యాప్తంగా మైకా నిల్వల్లో 70-80% ఇక్కడే ఉంది. దేశంలో మైకా ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ తొలి స్థానంలో ఉండగా రాజస్థాన్, బిహార్, ఝార్ఖండ్ తర్వాత ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో తిరుపతి జిల్లాలోని గూడూరు, నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరు, కావలి ప్రాంతాల్లో మైకా విరివిగా దొరుకుతోంది. తెలంగాణలోని వరంగల్ జిల్లా (బైసన్ పర్వత పంక్తి), ఖమ్మం జిల్లా పరిసర ప్రాంతాల్లోనూ లభిస్తుంది.


అభ్రకం


రచయిత: డాక్టర్ గోపగోని ఆనంద్

సీనియర్ ఇంటర్ తెలుగు



కలహించుకుంటే కష్టాలపాలు!

3 మార్కులు — **శాంతి కాంక్ష (పద్య భాగం)**

1) కౌరవులెల్ల గతి చెడి పడినట్టి కష్టముల్ వినయె.

జ: **కవి పరిచయం:** ఈ వాక్యం శ్రీనాథుడు రచించిన 'పల్నాటి వీర చరిత్ర' నుంచి గ్రహించిన 'శాంతి కాంక్ష' అనే పద్యభాగం లోనిది.

సందర్భం: మలిదేవరాజు నలగామ రాజు వద్దకు పంపిన రాయబారి భట్టు స్వాతంత్ర్య హీనత వల్ల కష్టాలను రాజుకు వివరించి చెప్పాడు. రెండు పక్షాల వారు ఐక్యమత్యంగా ఉంటే కలిగే మేలును కూడా వివరించాడు. అలా కాకుండా వీరిద్దరూ కలహించుకుంటే కౌరవుల వల్లనే గతి చెడి కష్టపడతారనే సోదాహరణంగా భట్టు నలగామ రాజుకు చెప్పిన సందర్భంలోనిది.

అర్థం: పూర్వం కౌరవులంతా దుర్గతి పాలై, వారు పడిన కష్టాలు మనం వినలేదా?

వ్యాఖ్య: 'అన్నదమ్ములైన పాండవులతో విరోధం పెట్టుకుని కౌరవులు సర్వనాశనమైన విషయం మనం విన్న విషయమే. కాబట్టి సోదరులైన మీరు కలహించి కౌరవుల్లా సర్వనాశనం కావద్దు' అని నలగామ రాజుకు భట్టు హితం చెప్పాడు.

2) శ్రీనాథుడి గురించి రాయండి.

జ: శ్రీనాథుడు తెలుగులో పురాణ ప్రబంధ యుగాలకు వారధిగా నిలిచిన మహాకవి. ఈయన 15వ శతాబ్దానికి చెందినవారు. ఇతడి తల్లి 'భీమాంబిక', తండ్రి 'మారయ'. బాల్యంలోనే "మరుత్తరాట్చరిత్రము"ను రచించారు. శ్రీనాథుడు సకల విద్యాసనాథుడు. బ్రహ్మదత్త వరప్రసాదుడు. ఈశ్వరార్చన కళాశీలుడు. ఈయన కొండవీటిరెడ్డిరాజుల ఆస్థానకవి, విద్యాధికారి. ఈయన ప్రౌఢదేవరాయల సభలో గౌడ డిండిమ భట్టును ఓడించి అతడి కంచుఢంకాలను పగులగొట్టించి ప్రౌఢదేవరాయలతో కనకాభిషేకాన్ని పొందారు. శ్రీనాథుడు శాలివాహన సప్తశతి, శృంగార నైషధం, కాశీఖండం, భీమఖండం, హరవిలాసం, శివరాత్రి మహాత్మ్యం, పల్నాటివీరచరిత్ర మొదలైన గ్రంథాలను రచించారు. శ్రీనాథుడికి 'కవి సార్వభౌముడు' అనే బిరుదు ఉంది. చివరి రోజుల్లో ఈయనను పోషించే రాజులు లేకపోయారు. ఈయన కృష్ణా తీరంలో 'బొడ్డుపల్లె' అనే గ్రామంలో పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేశారు.

ప్రశ్నలు జవాబులు

ముఖ్యమైనవి మరికొన్ని..

1) భట్టు రాయబారానికి వచ్చిన కారణాన్ని వివరించండి. (6 మా.)
2) శాంతి కాంక్ష పాఠ్య భాగం సారాంశాన్ని వివరించండి. (6 మా.)

జవాబుల కోసం

– ఎం. మహేశ్వర నాయుడు